

మనం

జనం కోసం అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 3 • సంచిక: 17 • పేజీలు: 8+8 • వెల: రూ.5 సోమవారం • 14-1-2019 www.manamnews.com /manamnews

సీఎం సంక్రాంతి శుభాకాంక్షలు



ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ పాడి పంటలతో వర్ధిల్లాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.



పరేడ్ గ్రౌండ్స్‌లో మొదలైన పతంగుల పండుగ



భోగి శుభాకాంక్షలు

గునగునా ఎగిరే గాలిపటాల సవ్వడులు.. కొత్త ధాన్యపు గింజల కోసం వచ్చే గువ్వల కిలకిలలు.. రంకెలు వేసే చలికి మూడంకె వేసుకుని ముణగదీసుకుని పడుకునే పిల్లలు.. వాళ్లను లేపి భోగిమంటలు వేయించే పెద్దల ఉత్సాహం.. అరిసెలు, పల్లీ లడ్డూలు, బొంగుముద్దలు, మినప సున్నుండలు, అన్నింటి సమాహారమే భోగి పండుగ. భోగభాగ్యాలను అందించే ఈ పండుగను అందరూ ఆస్వాదిస్తారని ఆశిస్తున్నాం...



ఐతే అల్లోల కాదంటే పోచారం

అసెంబ్లీ స్పీకర్ పదవికి పేర్ల ఫైనల్!

- ఇద్దరూ మాజీ సీనియర్ మంత్రులే
- సెంటిమెంట్ సందోహంలో పలువురి అనాసక్తి
- హాట్‌టాపిక్‌గా మారిన అత్యున్నత పదవి
- తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ఎపిసోడ్

హైదరాబాద్, జనవరి 13(మనం ప్రతినిది):

అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. స్పీకర్ గా పలువురు కీలక నేతల పేర్లు ప్రస్తావనకు వచ్చినా వారు పదవి చేపట్టడానికి ముందుకు రాకపోవడంతో స్పీకర్ ఎంపిక చర్చనీయాంశంగా మారింది. గతంలో స్పీకర్‌గా పని చేసిన వారంతా తర్వాతి ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆ భయం ప్రస్తుతం ఉన్న సభ్యులకు పట్టుకుంది. ఈ సారి బాధ్యతలు చేపట్టే వారు కూడా తర్వాతి ఎన్నికల్లో గెలవలేరనే సెంటిమెంట్‌తో ఎవరూ కూడా స్పీకర్ పదవి చేపట్టడానికి ముందుకు రావడం లేదు. ముందుగా స్పీకర్ పదవికి మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఎంపిక ఖాయమని చర్చ జరిగింది. ఇదే విషయమై సీఎం కేసీఆర్ ఈటల వద్ద ప్రస్తావించినట్టుగా కూడా కార్యకర్తలు చర్చించుకున్నారు. అయితే స్పీకర్ పదవి చేపట్టేందుకు ఈటల రాజేందర్ సుముఖంగా లేరని తెలుస్తోంది. సీఎంతో కూడా ఆయన ఈ విషయమై చర్చించి స్పీకర్ పదవి చేపట్టేందుకు తాను సిద్ధంగా లేనని మిగతా 2లో..

పండుగలకే పండుగ సంక్రాంతి

ఇన్‌స్టంట్ ఫుడ్ అంటే కాన్‌స్టంట్ డిసీజ్

- ఇండియన్ ఫుడ్‌ను ఆస్వాదించండి.. మన పండుగలకు పూర్వ వైభవం తేవాలి
- అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ ప్రారంభించిన ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- పతంగులు ఎగరేస్తూ స్వీట్స్ తినడం అరుదైన ఆనందమని వ్యాఖ్య
- ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన నగరం హైదరాబాద్

2లో..



పట్నంలోనే ఆవిష్కృతమైన పల్లె సంక్రాంతి

శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు ఘనంగా జరుగుతున్నాయి. తెలుగు సంస్కృతిని చాటేలా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. హరిదాసులు, పిట్టల దొరలు పర్యాటకులను అలరిస్తున్నారు. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకుంటున్నాయి.

గ్రామీణ వాతావరణం కనిపించేలా శిల్పారామంలో ప్రత్యేక అలంకరణలు చేశారు. పట్నంలో ఉన్నా పల్లె వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తూ నగరవాసులు ఖుషీ అవుతున్నారు.

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుక్లపక్షం అష్టమి రా.7.29 వరకు; తదుపరి: నవమి; నక్షత్రం: రేవతి ఉ.8.43 వరకు; తదుపరి: అశ్విని; వర్జ్యం: తె.5.31 నుంచి 6.31 వరకు(తెల్లవారితే మంగళవారం); దుర్ముహూర్తం: ప.12.31 నుంచి 1.13 వరకు; తదుపరి: ప.2.42 నుంచి 3.27 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుంచి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుంచి 12.00 వరకు; అమృతఘడియలు: ఉ.6.13 నుంచి 7.54 వరకు; **భోగి పండగ;**

వాతావరణం



సోమవారం తెలంగాణలో వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిళ్లు చలి ఎక్కువగా ఉంటుంది. గంటకు 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 30 డిగ్రీలు
కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు
గాలిలో తేమ: 52 శాతం

పాతబస్తీలో దారుణం

16 ఏండ్ల బాలికపై 11 మంది యువకులు అత్యాచారం



- వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్
- కామాంధులను కఠినంగా శిక్షించాలి
- కామాటిపురా ఠాణా వద్ద స్థానికుల ఆందోళన
- నలుగురు నిందితుల అరెస్టు, రిమాండ్

హైదరాబాద్, జనవరి 13 (మనం ప్రతినిధి)

నగరంలోని పాతబస్తీలో దారుణం చోటుచేసుకుంది. 16ఏళ్ల బాలికపై 11 మంది యువకులు అత్యాచారానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. కామాటిపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16 ఏళ్ల బాలికను కొంతమంది యువకులు ట్రాప్ చేశారు. మాయమాటలు చెప్పి లైంగికంగా లొంగదీసుకున్నారు. ఇలా మొత్తం 11 మంది యువకులు కొద్దిరోజులుగా బాలికపై లైంగిక దోపిడీకి పాల్పడుతున్నారు. అత్యాచారం చేసిన సమయంలో వీడియోలు తీసి బాధితురాలిని బెదిరిస్తూ నిత్యం నరకం చూపిస్తున్నారు. ఈ దారుణాన్ని మిగతా 2లో..

రికార్డు సృష్టించనున్న సర్పంచ్ ఎన్నికలు



పలు పంచాయతీలు ఏకగ్రీవం

కొన్ని మండలాల్లోని అన్ని గ్రామాల్లోనూ ఒకటే మాట

హైదరాబాద్, జనవరి 13(మనం ప్రతినిధి):

రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని గ్రామాల్లో సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి గ్రామ సర్పంచిగా గుమ్ముల రవీందర్‌ను ఏక గ్రీవంగా ఏనుకున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో మిగతా 2లో..



వేలం పాట ఏకగ్రీవాలు నేరం

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి

మొదటి విడత ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి నాగిరెడ్డి అన్నారు. వేలం పాటల ద్వారా గ్రామ పంచాయతీలను ఏకగ్రీవాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఆదివారం ఎన్నికల ఏర్పాట్లుపై నాగిరెడ్డి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సంక్రాంతి సెలవుల్లో సైతం సిబ్బంది పని చేయడం మిగతా 2లో..

ఇదీలోకం!



ఈ రెండు పుంజుల ఫైట్..
2019 కోడి పందేలకే హైలైట్ గురూ..!

కొంపముంచిన వలపు వల

ముద్దుగుమ్మతో ఫేస్‌బుక్‌లో చాటింగ్



- తాను ఆర్మీ కెప్టెన్ అంటూ వెల్లడి
- అనికా చోప్రా పేరుతో ఫేక్ ప్రొఫైల్
- సైనిక రహస్యాలు లాగిన గూఢచారి
- 50 మంది సైనికులతో ఫ్రెండ్‌షిప్
- సైనికుడి అరెస్టు.. కొందరి విచారణ

న్యూఢిల్లీ, జనవరి 13:

ఫేస్‌బుక్‌లో ఆమె పేరు అనికా చోప్రా. ఆకుపచ్చటి చీర కట్టుకుని.. చిరునవ్వులు రువ్వుతూ అనేక మందికి వలపు ..మిగతా 2లో



ప్రపంచ బ్యాంకు రేసులో ఇవాంకా

ఐరాస మాజీ రాయబారి నిక్కీహేలీ కూడా

అమెరికన్ నామినీ ఎంపికకు కసరత్తు షురూ

5

ఒకేసారి రుణమాఫీ!

ఒక్క బడ్జెట్‌లోనే రూ.46వేల కోట్లు


- కర్ణాటక సర్కారు సంచలన నిర్ణయం
- 4 విడతల్లో చేస్తామని తొలి ప్రకటన
- విపక్షాల విమర్శలతో సీఎం సాహసం
- ఒక్కసారే ఇస్తామన్న కుమారస్వామి
- ఇతర రాష్ట్రాలకు మోడల్ అని వెల్లడి
- ఇది బీజేపీ నాయకత్వానికీ చెబుతాం
- ఆర్థిక క్రమశిక్షణ కూడా పాటిస్తాం..
- ఇలా చేస్తున్న తొలి రాష్ట్రం మాదే
- హెచ్‌డీ కుమారస్వామి స్పష్టీకరణ



బెంగళూరు, జనవరి 13: ఒకవైపు తెలుగు రాష్ట్రాల్లో విడతల వారీగా రుణమాఫీలు చేస్తూ.. అసలు వచ్చాయో లేదో మిగతా 2లో..

పండుగలకే పండుగ సంక్రాంతి







హైదరాబాద్, జనవరి 13(మనం ప్రతినిధి) మకర సంక్రాంతి అనేది పండుగలకే పండగ అని, ఈ పండుగను దేశంలోని పలు ప్రాంతాల్లో విభిన్న పేర్లతో పిలుస్తారని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. దక్షిణాదిలో 'పొంగల్, సంక్రాంతి అని, పంజాబ్, హరియాణాలో లోహిరి అని, అసోంలో బిహు, బిహార్‌లో కిచిడి ఫెస్టివల్ అని పలు పేర్లతో ఈ పండగను పిలుచుకుంటారని చెప్పారు. ప్రతి భారతీయ పౌరుడు దేశీయ వంటకాలను తినాలని, పండుగలను జరుపుకుని సంస్కతి, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. అంతేకానీ చికెన్ 65 లాంటివి తింటే 25 ఏళ్లకే 65 వయసువారిగా మారిపోతారని, రోగాలను ఆహ్వానించడమేనని పేర్కొన్నారు. కైట్స్, స్వీట్స్ ఫెస్టివల్ ప్రాముఖ్యతను వెంకయ్య వివరించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ కైట్స్ అండ్ స్వీట్ ఫెస్టివల్ వేడుకలు ప్రారంభించిన అనంతరం వెంకయ్య నాయుడు ప్రసంగించారు. ఓవైపు పతంగులు, మరోవైపు స్వీట్లు అరుదైన కాంబినేషన్ అని మకర సంక్రాంతి నేపథ్యంలో ఈ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. 'భారతదేశ ప్రతి పండుగ వెనుక ఓ కారణం ఉంటుంది. జీవితం అంటే తిండి, బట్ట, పదవులే కాదు. సంగీతం, చిత్రలేఖనం, ఇలా ఒక్కొక్కరికి ఒక్కో మార్గంలో సంతోషం వస్తుంది. మనకు సంతోషాన్ని కలిగించే పండుగలలో పతంగుల పండగ ఒకటి. ఆకాశంలో ఎగరాలన్న మనిషి ఆలోచనలకు ప్రతిరూపమే గాలిపటం. క్రీడాస్ఫూర్తిగా నిదర్శనం కైట్స్. ఎంత ఎత్తుకు ఎదిగినా మళ్లీ కిందకి వస్తాయి. అందుకే మన మూలాలు మరిచిపోవద్దు. జీవితంలో తీపి ఉండాలి. స్వీట్ ఫెస్టివల్ మనకు తీపిని అందిస్తుంది. పుట్టిన రోజు నాడు, ఉద్యోగం వచ్చినా, ఏదైనా మంచి జరిగిన సందర్భాలలో తీపిని పంచుకోవడం అలవాటే. అందుకే ఈ సందర్భంగా స్వీట్ల ప్రాముఖ్యతను తెలిపేలా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రపంచమంతా ఒకటి, మనమంతా ఒకటేనని చాటిచెప్పాలి. కుల, మత, వర్గ బేదాలు లేకుండా కలిసికట్టుగా జీవించాలి. నలుడు, భీముడు పాకశాస్త్రంలో ప్రావీణ్యులు. నేడు సంక్రాంతి పండుగ నేపథ్యంలో వీటి ప్రాముఖ్యతను తెలిపేందుకు స్వీట్ ఫెస్టివల్.

హైదరాబాద్ ఓ అద్భుతం

హైదరాబాద్ ఓ అందమైన నగరం. ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన నగరం. అందుకే సంతోషవంతమైన, ఆకర్షణీయమైన, అభివద్ధి నగరానికి విదేశీయులను ఆత్మీయంగా స్వాగతిస్తున్నాం. ఎవరినైనా హైదరాబాద్ అక్కున చేర్చుకుంటుంది. మన హైదరాబాద్ దమ్ బిర్యానీ రుచి గురించి చెప్పాలా, కరాచీ బిస్కట్లు, ఇరానీ చాయ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ నేడు ఆన్‌లైన్‌లో కేఎఫ్‌సీ చికెన్, మెక్‌డోనాల్డ్స్ అంటూ విదేశీ వంటకాలు ఆర్డర్ చేసుకుని తింటున్నారు. ఇన్‌స్టంట్ ఫుడ్ అంటే కాన్‌స్టంట్ డిసీజ్. హోటళ్లు, రెస్టారెంట్స్ కొత్త పేర్లతో వంటకాలు చేసి మనల్ని మోసం చేస్తున్నాయి. హోటల్‌కు వెళితే చికెన్ 65 అని ఉంటుంది. చూస్తే మీ వయసు 25 ఉంటుంది. అది మీరు తింటే మీ వయసు తొందరగా 65 అవుతుంది.

ఆ వంటకాలు ఎక్కువగా తింటే త్వరలోనే వయసు 85 కూడా అవుతుంది. అందుకే హైదరాబాద్, తెలంగాణ, ఆంధ్రా వంటకాలతో పాటు బెంగాళీ, తమిళ్ ఇలా ఇండియన్ ఫుడ్‌ను ఆస్వాదించండి. తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయినా అన్ని విషయాల్లో సహకరించుకుని ముందుకు సాగాలి. మన సంస్కతి, సాంప్రదాయాలతో పాటు పండుగలు, ఆటలు, పాటలు, వంటకాలు అన్నింటికీ పూర్వ వైభవం తీసుకురావాలని' ఉపరాష్ట్రపతి వెంకయ్య ఆకాంక్షించారు





అయితే అల్లోల కాదంటే పోచారం

(మొదటిపేజీ తరువాయి)

సున్నితంగానే చెప్పారని తెలుస్తోంది. ఈటల రాజేందర్ స్పీకర్ పదవి చేపట్టకపోతే డిప్యూటి స్పీకర్ గా పని చేసిన పద్మాదేవేందర్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని సీఎం కేసీఆర్ భావించారట. కానీ తనకు మంత్రి పదవే కావాలని స్పీకర్ పదవి తాను చేపట్టలేనని పద్మా దేవేందర్ రెడ్డి కూడా కేసీఆర్ కు చెప్పారని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. సీఎం కేసీఆర్ రెడ్యానాయక్ పేరును కూడా పరిశీలించారు. కానీ అనూహ్యంగా రెండు కొత్త పేర్లు స్పీకర్ పదవికి తెరపకి వచ్చినట్టు తెలుస్తోంది. వ్యవసాయ శాఖ మంత్రి గా పని చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి పేరు స్పీకర్ పదవికి కేసీఆర్ పరిశీలిస్తున్నారని సమాచారం. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాల్కొండ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. గత ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి సీనియర్ నేత. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని స్పీకర్ పదవికి పోచారం పేరును కేసీఆర్ పరిశీలిస్తున్నారని తెలుస్తోంది. మరో నేత పేరు కూడా కేసీఆర్ పరిశీలనలో ఉందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పేరును కూడా స్పీకర్ పదవికి కేసీఆర్ పరిశీలిస్తున్నారట. అల్లోల గత కేబినేట్‌లో దేవాదాయ శాఖ మంత్రిగా పని చేశారు. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ నుంచి ఆయన మరో సారి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఈ సారి అల్లోలకు స్పీకర్ పదవి ఇస్తే ఎలా ఉంటుందని పార్టీ కీలక నేతల వద్ద కేసీఆర్ అభిప్రాయం తీసుకున్నారని తెలుస్తోంది. అయితే అల్లోల పని తీరు పై కేసీఆర్ అసంత ప్తిగా ఉన్నారని ఆయనకు ఈ సారి కేబినేట్ లో చోటు దక్కకపోవచ్చని చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో స్పీకర్ పదవి చేపట్టడానికి ఎవరూ ముందుకు రాకపోతే అప్పటికప్పుడు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి స్పీకర్ పదవి ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నారని తెలుస్తోంది. స్పీకర్ పదవికి ఉన్న సెంటిమెంట్ ఆ పదవి చేపట్టాలంటేనే భయపడే విదంగా తయారైంది. స్పీకర్ పదవి ఎవరికి దక్కుతుందో తొందరలోనే తేలనుంది. అనూహ్యంగా ఈ ఇద్దరు నేతల పేరు తెరపైకి రావడంతో పార్టీలో కూడా తీవ్ర చర్చ జరుగుతోంది. టిఆర్ఎస్ నేతలను స్పీకర్ పదవి తీవ్ర భయాన్ని రేపుతుంది. స్పీకర్ పదవి చేపట్టిన తర్వాత మళ్లీ ఏ నాయకుడు కూడా గెలవలేదు. దీంతో నేతలంతా స్పీకర్ పదవితోటే తమ రాజకీయ జీవితం ముగుస్తుందని భయపడుతున్నారు. మరి స్పీకర్ పదవి ఎవరిని వరిస్తుందో ఆ పదవి చేపట్టేందుకు ఏ నేత ధైర్యం చూపబోతున్నారోనన్న చర్చ హాట్ టాపిక్ గా మారింది.

రికార్డు సృష్టించనున్న సర్పంచ్ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ముజ్జిగూడెం, అప్పలనర్సింహ పురం, తిరుమలాపురం తండా, సుద్రేపల్లి పంచాయతీల్లో ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. తిరుమలాయపురం మండలంలో సోలిపురం పంచాయతీ ఏకగ్రీవం అయింది. మహబూబ్ నగర్ జిల్లా కృష్ణా మండలంలో 4 పంచాయతీలైన గురజాల, ఆలంపల్లి, మురహరిదొడ్డి, ఐనాపూర్ ఏకగ్రీవం అయ్యాయి. మాగనూరు మండలంలో రెండు పంచాయతీలు ఉజ్జెల్లి, గురువావులింగంపల్లి పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. నిర్మల్ జిల్లా మామడ మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మహబూబ్ నగర్ జిల్లా క ష్ణా మండలంలో 4 పంచాయతీలైన గురజాల, ఆలంపల్లి, మురహరిదొడ్డి, ఐనాపూర్ ఏకగ్రీవం అయ్యాయి. మాగనూరు మండలంలో రెండు పంచాయతీలు ఉజ్జెల్లి, గురువావులింగంపల్లి పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. నిర్మల్ జిల్లా మామడ మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

వేలం పాట ఏకగ్రీవాలు నేరం

(మొదటిపేజీ తరువాయి)

అభినందనీయమన్నారు. ఎంపీడీఓలు సర్పంచ్ అభ్యర్థి ఖర్చు చేసే వ్యయాలను లెక్కిస్తారు. ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించిన వారిపైన కేసు లు నమోదు చేస్తున్నామని, రుజువైతే పదవిని కూడా కోల్పోతారన్నారు. పోలింగ్ శాతం భారీగా నమోదు అయ్యే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. ఓటర్లను ప్రలోభ పెడితే పోలీస్ కేసు లు నమోదు చేస్తామని నాగిరెడ్డి తెలిపారు

పాతబస్తీలో దారుణం

(మొదటిపేజీ తరువాయి)

ఎవరికైనా చెబితే వీడియోలు సోషల్‌మీడియాలో పెట్టి పరువు తీస్తామని నిందితులు బెదిరించడంతో బాధితురాలు మిన్నకుండిపోయింది. కామాంధుల చేష్టలతో విసిగిపోయిన బాధితురాలు ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు షాక్‌కు గురయ్యారు. బస్తీవాసుల సాయంతో బాధితురాలి కుటుంబం కామాటిపురా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం సుమారు 200 మంది స్థానికులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. బాలికకు నరకం చూపించిన కామాంధులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజేష్, శుభం వ్యాస్, అజిత్ అనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో కీలక నిందితుడైన విజయ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చైనా బొగ్గు గనిలో ఘోర ప్రమాదం

- **పైకప్పు కూలి 21 మంది దుర్మరణం**

బీజింగ్, జనవరి 13: చైనా బొగ్గు గనిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వాయవ్య చైనా ప్రాంతంలోని ఓ గనిలో పైకప్పు కూలిపోవడంతో 21 మంది కూలీలు మరణించారని స్థానిక మీడియా ఆదివారం వెల్లడించింది. శనివారం సాయంత్రం షాంగ్జి ప్రావిన్సులో లిజియాగావ్ బొగ్గు గనిలో భూగర్భ ప్రాంతంలో 87 మంది కూలీలు పనిచేస్తుండగా, హఠాత్తుగా పైకప్పు కూలిపోయింది. 19 మంది అక్కడికక్కడే మరణించగా, 66 మంది ప్రాణాలతో బయటపడ్డారు. వారిని సురక్షితంగా గని నుంచి బయటకు తీసుకువచ్చారు. అనంతరం సహాయక బ ందం మరో రెండు మ త దేహాలను గుర్తించింది. ఈ ఘటనకు గల కారణాలపై విచారణ నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోనే బొగ్గు ఉత్పత్తిలో మొదటిస్థానంలో ఉన్న చైనాలో ఇలాంటి ప్రమాదాల గురించి తరచూ వార్తలు వస్తుంటాయి.

కొంపముంచిన వలపు వల

(మొదటి పేజీ తరువాయి)





వల విసిరింది. తనను తాను మిలటరీ నర్సింగ్ కోర్‌లో ఒక ఆర్మీ కెప్టెన్ అని చెప్పుకొంది. ఆమె విసిరిన చిరునవ్వు 50 మంది భారతీయ సైనికుల కొంప ముంచింది. వాళ్లంతా ఇప్పుడు నిఘానీడలో ఉన్నారు. సోమ్‌వీర్‌సింగ్ అనే ఒక సిపాయిని ఇప్పటికే అరెస్టుచేశారు కూడా. పాకిస్థానీ నిఘా సంస్థలు ఎప్పటినుంచో అమలుచేస్తున్న ఈ వలపు వల (హనీ ట్రాప్) భారత ఆర్మీ వర్గాలను పదే పదే కలవరపాటుకు గురిచేస్తోంది. జైసల్మీర్‌లోని ఒక ఆయుధాల యూనిట్‌లో పనిచేస్తున్న సిపాయ్ సోమ్‌వీర్ సింగ్.. ఆ యూనిట్‌కు సంబంధించిన కీలక సమాచారం పంపడంతో పాటు దాని ఫొటోలు, లొకేషన్ కూడా అనికా చోప్రాకు షేర్ చేసినందుకు అతడిని అరెస్టుచేశారు. చోప్రా వాస్తవానికి పాకిస్థానీ ఏజెంటు అని, ఇప్పటికే పెళ్లయిన సోమ్‌వీర్‌తో పాటు సుమారు 50 మంది జవాన్లపై వలపు వల విసిరిందని సైనిక నిఘా సంస్థలతో పాటు రాజస్థాన్ ఏటీఎస్ బృందం కూడా గుర్తించింది. అయితే, ఆమె తనను బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టేవరకు ఆమె గురించి తనకేమీ తెలియదని సోమ్‌వీర్ సింగ్ అంటున్నాడు. అతడికి ఉద్యోగం వచ్చిన కొన్నాళ్లకే 2016లో ఫేస్‌బుక్‌లో అనికా చోప్రా అతడికి స్నేహితురాలైంది. ఒక ఆడ సైనికాధికారి నవ్వుతూ తనకు ఫ్రెండ్ రిక్వెస్టు పంపేసరికి అతడు ఫ్లాటైపోయి వెంటనే ఓకే చేసేశాడు. ఇద్దరి మధ్య బంధం బలపడింది. దాంతో చివరకు తన భార్యకు విడాకులిచ్చి అనికను పెళ్లి చేసుకోవాలని కూడా సోమ్‌వీర్ భావించాడు. అయితే ఐదు నెలల నుంచి అతడికి జమ్ము ప్రాంతం నుంచి ఫోన్లు వస్తుండటం, అవి అనుమానాస్పదంగా ఉండటంతో సైనిక నిఘా సంస్థలు అతగాడి కార్యకలాపాలపై ఓ కన్నేసి ఉంచాయి. తర్వాత అతడి ఫేస్‌బుక్ చాటింగులను పరిశీలించగా, కెప్టెన్ అనికా చోప్రాది అని చెప్పుకొన్న అకౌంట్ పాకిస్థాన్ నుంచి ఆపరేట్ అవుతున్నట్లు గుర్తించారు. మొదట్లో చాలా అమాయకంగా.. నీకు పోస్టింగ్ ఎక్కడ వచ్చింది? మీ ట్యాంక్ ఫొటో పంపగలవా? ఫీల్డ్ ఫైరింగ్ ఎప్పుడు జరిగింది అని ఆమె ప్రశ్నించేది. తన స్నేహితురాలు కాబట్టి సోమ్‌వీర్ వెంటనే వాటికి సానుకూలంగా సమాధానాలు ఇచ్చేవాడు. కానీ, ఆ వివరాలు చెప్పగానే ఆమె అతడిని బ్లాక్‌మెయిల్ చేయడం మొదలు పెట్టింది. సమాచారం పంపినందుకు సోమ్‌వీర్ కొంత డబ్బు కూడా తీసుకునేవాడు గానీ, ఇప్పటి వరకు కేవలం రూ. 5వేలు మాత్రమే అలా వచ్చినట్లు సైనిక నిఘా వర్గాలు చెబుతున్నాయి. అనికా చోప్రా కేవలం సోమ్‌వీర్‌నే కాక మరో 50 మంది సైనికులను కూడా పడేయడానికి ప్రయత్నించి, వారి పోస్టులకు లైకులు, కామెంట్లు చేయడం మొదలుపెట్టింది. దాంతో ఆ సైనికులందరినీ రాజస్థాన్ ఎస్‌టీఎఫ్, సైనిక నిఘా వర్గాల సంయుక్త బృందం ఇపుడు ప్రశ్నిస్తోంది. చాటింగ్ చేయడానికి ఒక్కో జవానుకు ఆమె ఒక్కో సమయం ఇచ్చినట్లు విచారణలో తేలింది. వలపువల విసరడం అనేది గూఢచర్యంలో చాలాకాలం నుంచే ఉంది గానీ, ఇటీవల సోషల్ మీడియా విస్తృతితో అది మరింత వేగంగా జరుగుతోంది. బాలీవుడ్ హీరోయిన్ల ఫేక్ ప్రొఫైళ్లతో అనేకమంది ఇలా సైనికులను వలలోకి దించే ప్రయత్నం చేస్తున్నారని, అందువల్ల సైనిక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ ఇటీవల హెచ్చరించారు.

ఒకేసారి రుణమాఫీ!

(మొదటి పేజీ తరువాయి)



అన్న పరిస్థితి కనిపిస్తుంటే, కర్ణాటకలోని జేడీఎస్-కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఒకే దెబ్బకు ఏకంగా రూ. 46వేల కోట్ల రుణాలనుమాఫీ చేస్తామని, ఫిబ్రవరి 8వ తేదీన ప్రవేశపెట్టే తమ ప్రభుత్వ రెండో బడ్జెట్‌లోనే దీనికి నిధులు ఇస్తామని అంటోంది. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి స్వయంగా ప్రకటించారు. తొలుత నాలుగు దశల్లో రుణమాఫీ చేద్దామనుకున్నామని, కానీ బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం పదే పదే తనను ఇదే అంశంపై విమర్శిస్తుండటంతో ఇక ఒక్కసారే మాఫీ చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. చాలా తక్కువ మంది రైతులకు 'లాలీపాప్' ఇస్తున్నారంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఒక సందర్భంలో కుమారస్వామిని విమర్శించారు. ఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ సదస్సులో కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఒకవైపు రుణమాఫీ ప్రకటించిన కర్ణాటక సర్కారు, మరోవైపు రుణాల రికవరీ కోసం రైతులకు నోటీసులు జారీచేస్తోందని మండిపడ్డారు. అయితే ఈ నోటీసులను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని జాతీయ బ్యాంకులే ఇస్తున్నాయని కుమారస్వామి అన్నారు. ఇది బీజేపీ నేతల నీచబుద్ధిని చూపిస్తోందని, రైతుల సమస్యలను పరిష్కరించే అంశాన్ని వాళ్లెంత తేలిగ్గా తీసుకున్నారో అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి 8వ తేదీన తాను 2019-20 సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెడతానని, ఇంతకుముందు రుణమాఫీని నాలుగుదశల్లో అమలుచేస్తామని కేబినెట్ నిర్ణయంగా చెప్పాము గానీ, ఇప్పుడు నాలుగు దశలు తీసుకోబోమని అన్నారు. దీనిపై తాము కృషి చేస్తున్నామని, వచ్చే బడ్జెట్‌లో తాను మొత్తం రుణమాఫీని క్లియర్ చేస్తానని చెప్పారు. తాను నాలుగేళ్లు తీసుకోబోనని, ఇది లాలీపాప్ కాదన్న విషయాన్ని బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టికి కూడా తీసుకెళ్తానని తెలిపారు. ఆర్థిక బాధ్యతను విస్మరించకుండానే ఇది కూడా చేస్తామని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం సరిగా ఆలోచిస్తే.. ఆర్థిక క్రమశిక్షణను ఉల్లంఘించకుండానేతన కార్యక్రమాలను, నిబద్ధతను ఎలా అమలు చేయగలదో తాను రుజువు చేస్తానన్నారు. మొత్తం రూ. 46వేల కోట్ల రుణమాఫీకి నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. తమ రాష్ట్రం అమలుచేసే ఈ పథకం భవిష్యత్తులో చాలా రాష్ట్రాలకు నమూనా అవుతుందని ఆయన చెప్పారు. జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకులలో రూ. 46 వేల కోట్ల మేర పంటరుణాలు ఉన్నాయని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక సెల్ ఏర్పాటుచేసి, ఐఏఎస్ అధికారిని నియమించి దీనిపై 24 గంటలూ కృషి చేస్తున్నామని సీఎం తెలిపారు. తన కార్యాలయం కూడా దీన్ని ప్రతిరోజూ పర్యవేక్షిస్తోందని, తమ అధికారులు సమర్థంగా పనిచేస్తూ.. రుణమాఫీ సరిగా రైతులకు చేరేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. రుణమాఫీ పథకం అమలుకు తమ ప్రభుత్వం రూపొందించే మార్గదర్శకాలు భవిష్యత్తులో ఏ ప్రభుత్వానికైనా ఉపయోగపడతాయని తెలిపారు. జనవరి 11 వరకు 1.70 లక్షల మందికి రూ. 900 కోట్ల మేర రుణమాఫీ అందిందని, గత జూలైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తొలి సంవత్సరమే తాము 9000 కోట్లు రుణమాఫీకి కేటాయించామని అన్నారు. జనవరి 31 నాటికి మరో 11-12 లక్షల మంది రైతులకు రుణమాఫీ ప్రయోజనం అందుతుందన్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో గతంలో చాలా ఆలస్యం చేశాయని, కానీ తాము మాత్రం కేవలం ఏడునెలల్లోనే చేసి చూపించామని అన్నారు. యూపీఏ ప్రభుత్వం రూ. 70 వేల కోట్ల రుణమాఫీ ప్రకటించినా, అది రైతులకు చేరేందుకు ఎంతకాలం పట్టిందో చూడాలన్నారు. యూపీ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ లాంటి చాలా రాష్ట్రాలు కూడా దీన్ని అమలుచేశాయని, కానీ ఇప్పటివరకు ఎంత డబ్బు వెళ్లిందో అందరికీ తెలుసని చెప్పారు. జాతీయ బ్యాంకులతో చర్చలు జరుగుతున్నాయని, వన్‌టైం సెటిల్‌మెంట్ చేస్తున్న దృష్ట్యా కొంత మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం కోరుతోందని సీఎం తెలిపారు. సహకార బ్యాంకులలో రూ. 9వేల కోట్ల రుణాలు ఉన్నాయంటున్నా, వాటిలో కొన్ని బోగస్ ఉన్నాయన్నారు. కొన్ని పత్రాలు సమర్పించాలని కోరుతున్నామని, దాంతో నిధులు దుర్వినియోగం కాకుండా ఉంటాయని కుమారా స్వామి అన్నారు. రుణమాఫీ పథకం అమలు చేయడం తమ అతిపెద్ద విజయం అవుతుందని స్పష్టం చేశారు. తాను అధికారం చేపట్టిన కొత్తల్లో సిద్దరామయ్య ప్రభుత్వం పథకాలను అమలుచేయాల్సి వచ్చిందని, దాంతో జేడీఎస్ మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా అధికారంలోకి వచ్చిన 24 గంటల్లో రుణమాఫీ చేయలేదంటూ బీజేపీ విమర్శించిందని గుర్తుచేశారు.

బలవంతంగా మతమార్పిడి!

- **రాజస్థానీ యువతిపై అఘాయిత్యం**
- **దుబాయ్ పంపుతానని బెదిరింపు**

జైపూర్, జనవరి 13: తనను ఓ వ్యక్తి బ్లాక్‌మెయిల్ చేసి బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చాడని రాజస్థాన్‌కు చెందిన 18 ఏళ్ల యువతి వాపోయింది. తనను తొమ్మిది నెలల క్రితం జమ్ము కశ్మీర్‌లోని కుప్వారా ప్రాంతానికి తీసుకెళ్లి ఇలా చేశారని ఆమె పోలీసులకు తెలిపింది. నకిలీ పెళ్లి పత్రాలపై తనతో బలవంతంగా సంతకం చేయించుకుని, ఇస్లాం మతం పుచ్చుకునేలా చేశారని, తనను దుబాయ్ పంపేస్తానని కూడా బెదిరించారని తన ఫిర్యాదులో పేర్కొంది. ఆమెతో గొడ్డు మాంసం తినిపించి, నమాజ్ కూడా చేయించారని మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2018 మార్చి 16న ఆమె వడోదరకు బయల్దేరుతుండగా.. బార్మర్ నుంచి కనిపించకుండా పోయింది. అంతకుముందు ఆమె ఫొటోలు సంపాదించి, వాటిని ఎడిట్ చేసిన ఓ వ్యక్తి ఆమెను బ్లాక్‌మెయిల్ చేయసాగాడు. తనతో ఖాళీ కాగితాల మీద సంతకం చేయించుకున్నాడని, తర్వాత అవే పెళ్లిపత్రాలుగా మారాయని ఆమె తెలిపింది. ముస్లిం మతం పుచ్చుకోడానికి తాను నిరాకరించగా కొట్టారని కూడా చెప్పింది. తన ను దుబాయ్ పంపడానికి వాళ్లు ప్రయత్నించారని, తనకు అవకాశం రాగానే బార్మర్‌కు టికెట్ బుక్ చేసుకున్నానని తెలిపింది. ఈ కేసు దర్యాప్తునకు కొందరు అధికారులు జమ్ము కశ్మీర్‌కు వెళ్లారని బార్మర్ జిల్లా ఎస్పీ రశి డోగ్రా తెలిపారు. ఆ యువతికి తగు న్యాయం చేస్తామన్నారు. అయితే పోలీసులు ఇంకా తన వాంగ్మూలాన్ని నమోదు చేయలేదని.. తనకు భద్రత కావాలని ఆ యువతి తెలిపింది.

హెచ్‌ఎంపై సస్పెన్షన్ ఎత్తివేత

భోపాల్, జనవరి 13: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ గురించి అవమానకరంగా వ్యాఖ్యానించిన స్కూలు హెడ్మాస్టర్ సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. తాను ఆ ఉపాధ్యాయుడిని క్షమిస్తున్నట్లు ముఖ్యమంత్రి కమల్‌నాథ్ చెప్పడంతో సస్పెన్షన్ ఎత్తేశారు. జబల్‌పూర్‌లోని కనిష్ఠ బునియాదీ మిడిల్ స్కూలు ప్రధానోపాధ్యాయుడు ముకేష్ తివారీ కమల్‌నాథ్‌ను 'డాకూ' (గజదొంగ) అని స్కూలు సమావేశంలో అభివర్ణించారు. దానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో జిల్లా కలెక్టర్ ఛావీ భరద్వాజ్ ఆయనను సస్పెండ్ చేశారు. అయితే, తాను భావప్రకటనా స్వేచ్ఛను గౌరవిస్తానని, ఆయనపై చర్యలు తీసుకోవడం సరికాదని సీఎం కమల్‌నాథ్ అన్నారు.

కోడికత్తి కేసులో.. కీలక మలుపులు!

విశాఖపట్నం, జనవరి13, మనం ప్రతినిధి: విశాఖ విమానాశ్రయంలో ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై కోడికత్తితో దాడిచేసిన నిందితుడు జాపల్లి శ్రీనివాసరావుని మరింత లోతుగా విచారణ జరిపేందుకు ఎన్ఐఏ అధికారులు అతనిని రహస్య ప్రదేశానికి తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈమేరకు రాత్రికి నిందితుడిని ఢిల్లీ లేక ముంబయి తరలించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. కాగా నిందితుడు ఇప్పటికే కొంత సమాచారం ఎన్ఐఏ అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. మరో 6 రోజుల కస్టడీ గడువు ఉన్నందున పూర్తి వివరాలు తెలిసే అవకాశాలు న్నాయని అంచనా వేస్తున్నారు. శనివారం నుంచి ఎన్ఐఏ దర్యాప్తు ముమ్మరం కావటంతో ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్నవారు అజ్ఞాతంలోకి వెళ్లినట్టు తెలుస్తోంది. నిందితుడికి క్లీన్ చిట్ ఇచ్చి కీలక ప్రదేశం అయిన విమానాశ్రయంలోని హోటల్‌లో పనిచేసే అవకాశం కల్పించ డంలో సహకరించిన పోలీసులను, పాస్ లేకున్నా విమానాశ్రయంలో యథేచ్ఛగా తిరిగేందుకు అనుమతించిన విమానాశ్రయ భద్రతా అధికారులని, మూడు నెలలపాటు సీసీ కెమెరాలు పనిచేయకుండా కీలక ప్రదేశాన్ని పట్టించుకోని వారిని కూడా దోషులుగా చేర్చి..వీరందరినీ కస్టడీలోకి తీసుకుని ఎన్ఐఏ అధికారులు విచారించే అవకాశాలున్నాయి.





లోపల్కిబోతెందుకు తొక్కులాట

ఊర్కిపోవడాన్కి వారం రోజుల నుంచీ ఒకటే యాతన. బస్సుల కోసం తప్పని వేదన. వాహనం కన్పిస్తే చాలు ఎట్లాగైనా ఎక్కాలనే ఆరాటం.. బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద ఆదివారం కన్పించిన తొక్కులాట దృశ్యాలు.

పారదర్శక రాజకీయాలకు
ప్రతిరూపం చెన్నారెడ్డి



- జయంతి కార్యక్రమంలో రోశయ్య

హైదరాబాద్, జనవరి13(మనంప్రతినిధి) : పారదర్శక రాజకీయాలకు ప్రతిరూపం మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి అని మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ డాక్టర్ కె రోశయ్య కొనియాడారు. చెన్నారెడ్డి జయంతి కార్యక్రమాలు గాంధీభవన్‌తో పాటు ఇందిరాపార్క్ వద్ద చెన్నా రెడ్డి రాక్ మెమోరియల్ వద్ద జరిగాయి. ఈ సందర్భంగా నేతలు చెన్నారెడ్డి చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

ఈ కార్య క్రమంలో ఎమ్మెల్సీలు మహ్మద్ అలీ షబ్బీర్, పొంగులేటి సుధాకరరెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నంది ఎల్లయ్య, మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు, జస్టిస్ సుభాషణ్ రెడ్డి, కౌన్సిల్ మాజీ చైర్మన్ చక్కరపాణి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రోశయ్య మాట్లాడుతూ, పారదర్శక రాజకీయాలకు ప్రతిరూపం చెన్నారెడ్డి అని కొనియాడారు. ఆయన మంత్రి వర్గంలో పని చేసే అదృష్టం తనకు దక్కిందన్నారు. చెన్నారెడ్డి గొప్పతనాన్ని గూర్చి ఎంత చెప్పినా తక్కువేనన్నారు.

చెన్నారెడ్డి తన తనయుడు మర్రి శశిధర్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. తన తండ్రి బయోగ్రఫీ రాస్తున్నట్లు వెల్లడించారు. తన తండ్రి లాంటి వాళ్లు అరుదుగా ఉంటారని చెప్పారు. నాయన పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు నాగుపాము ఆయన చుట్టూ ఉండేదని తెలిపారు. ఆయనకు నాగదేవత ఆశీర్వాదం ఉండేదని పేర్కొన్నారు. ఆయన చనిపోయినప్పుడు కర్మకు నాగుపాము భోజనం తిన్నామని చెప్పారు.

మహానేత: ఉత్తమ్

తెలంగాణలో పుట్టిన మహానేత చెన్నారెడ్డి అని టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. పారదర్శక రాజకీయాలకు ప్రతిరూపంగా అభివర్ణించారు. ఉన్నది ఉన్నట్లుగా చెప్పే ముక్కుసూటి తత్వం ఆయనదని అన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనదని అన్నారు. మాజీ స్పీకర్ కెఆర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ, తనకు రాజకీయ అవకాశాలను కల్పించిన వ్యక్తి చెన్నారెడ్డి అని అన్నారు. శాసనసభ మీద చాలా ప్రేమ ఉన్న వ్యక్తియని, గొప్పపరిపాలనాదక్షుడు అని వ్యాఖ్యానించారు. మాజీ ఎంపి టి సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ, చెన్నారెడ్డి గొప్ప మానవతావాది అని అన్నారు.తనకు 50ఏండ్ల నుంచి పరిచయమన్నారు. మర్రి చెన్నారెడ్డిలాంటి వ్యక్తి మళ్లీ పుట్టడని చెప్పారు.

చెన్నారెడ్డి తెలంగాణ ఉద్యమానికి ఆకర్శితుడనయ్యా : చాడ వెంకటరెడ్డి

1969 లో చెన్నారెడ్డి ప్రారంభించిన తెలంగాణ ఉద్యమానికి తాను ఆకర్శితుడిని అయ్యానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శిచాడ వెంకటరెడ్డి చెప్పారు. తాను మొదట ప్రచారం చేసింది తెలంగాణ ప్రజా సమితి(టీపీఎస్)కేనని అన్నారు. ఆనాడు 13సీట్లలో టీపీఎస్ పోటీ చేస్తే 10 ఎంపీ స్థానాలలో గెలిచిందని చాడ గుర్తు చేశారు.

ఆయన జీవితం దేశానికి ఆదర్శం: జెపాల్ రెడ్డి

చెన్నారెడ్డి జీవితం దేశానికి ఆదర్శమని కేంద్ర మాజీమంత్రి ఎస్ జైపాల్ రెడ్డి అన్నారు. గొప్ప వ్యక్తిత్వం కలిగిన నేత అనీ, పేదవారి జీవితాలను మార్చేందుకు జీవితాంతం పరితపించారని చెప్పారు. మాజీ మంత్రి గీతారెడ్డి మాట్లాడుతూ, తనకు ఎమ్మెల్యేగా టికెట్ ఇవ్వడమే గాక మంత్రి పదవి కూడా ఇచ్చారని చెప్పారు. ముఖ్యమంత్రిగా ప్రతిపక్ష నేతలకు కూడా గౌరవం ఇచ్చేవారని తెలిపారు.

ఆయన బతికి ఉంటే తిరుగుండేది కాదన్నారు. తెలంగాణ ప్రజాసమితిలో చెన్నారెడ్డి ప్రెసిడెంట్ అయితే, మా అమ్మ ఈశ్వరీబాయి వైస్ ప్రెసిడెంట్‌గా ఉండేదని గీతారెడ్డి తెలిపారు.

విజన్ ఉన్న నేత : డీకే సమరసింహారెడ్డి

చెన్నారెడ్డి విజన్ ఉన్ననేతగా మాజీ మంత్రి డీకే సమరసింహారెడ్డి కొనియాడారు. ఆయనను నమ్ముకుంటే ఏదైనా చేసేవారన్నారు. తాను అడగ్గానే గద్వాలలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు జీవో మంజూరు చేశారని కృతజ్ఞతను వ్యక్తం చేశారు.

తెలంగాణ ఉద్యమానికి వెన్నుపోటు పొడవలేదు : నాయిని నర్సింహారెడ్డి

1969లో తెలంగాణ ఉద్యమానికి చెన్నారెడ్డి వెన్నుపోటు పొడిచారని విమర్శలు ఉన్నాయని, అది సరికాదని హోంశాఖ మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి చెప్పారు.

టీపీఎస్ ద్వారా గెలిచిన ఎంపీలు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన నిస్సహాయుడయ్యారని, అప్పుడు ఉద్యమాన్ని కొంత కాలం నిలిపివేశారని తెలిపారు.

ప్రభుత్వానికే దానమిచ్చిన దాతలు

- వృద్ధాశ్రమాన్ని విరాళంగా ఇస్తున్న దంపతులు
- కేటీఆర్‌ను కలిసిన యాదాద్రి జిల్లాకు చెందిన వృద్ధులు మేరెడ్డి సత్యనారాయణ రెడి, జానకమ్మ దాతృత్వం
- దంపతుల సేవా దృక్పథాన్ని కొనియాడిన కేటీఆర్



హైదరాబాద్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పెద్ద కొండూరు గ్రామంలో నిర్మించిన మేరెడ్డి సత్యనారాయణ రెడ్డి జానకమ్మ వానప్రస్థాశ్రమాన్ని ప్రభుత్వానికి డొనేట్ చేసేందుకు ముందుకు వచ్చారు ఆశ్రమ నిర్మాతలు మేరెడ్డి సత్యనారాయణ రెడ్డి మరియు జానకమ్మ దంపతులు. ఈ మేరకు తెలంగాణ భవన్లో టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీ రామారావు గారిని కలిసి పూర్తి వివరాలు అందించారు.

ఎకరంన్నర భూమిలో దాదాపు ఆరు వేల చదరపు అడుగుల భవనాన్ని సొంత ఖర్చులతో నిర్మించామని, అనారోగ్యం రీత్యా భవనంతో పాటు పూర్తి ఆశ్రమాన్ని ప్రభుత్వానికి విరాళం ఇవ్వడానికి నిశ్చయించామని, వృద్ధులకు సేవలు కొనసాగేలా చూడాలని వారు కేటీఆర్‌ని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, యాదాద్రి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్ తో మాటాడతారని, మీరు ప్రారంభించిన ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగించేలా ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందేలా చూస్తామని దంపతులకు కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్ తో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా దంపతుల సేవా దృక్పథాన్ని, దాతత్వాన్ని కేటీఆర్ కొనియాడారు.

వెరీగుడ్డు

- కోడిగుడ్లు తినడంలో మనమే ఫస్ట్

హైదరాబాద్ : కోడిగుడ్ల వినియోగంలో తెలంగాణ ముందంజలో ఉంది. నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (నెక్) నివేదిక ప్రకారం.. తెలంగాణలోనే కోడి గుడ్ల వినియోగం ఎక్కువగా ఉంది. రాష్ట్రంలో కోడి గుడ్ల తలసరి వినియోగం ఏడాదికి 180 అని తేల్చింది నెక్ నివేదిక. ఇది జాతీయ పౌష్టికాహార సంస్థ(ఎన్ఐఎన్) చెప్పిన తలసరి వినియోగా నికి సమానం అని తన నివేదికలో పేర్కొంది నెక్. ఈ నివేదిక ప్రకారం కోడి గుడ్ల వినియోగంలో తెలంగాణ టాప్‌లో నిలిచింది. ఇక దేశ వ్యాప్తంగా రోజుకు 22 కోట్ల కోడిగుడ్లు ఉత్పత్తి అవుతుండగా.. అందులో తెలంగాణ వాటా 3.2 కోట్లు అని నెక్ తెలిపింది. తెలంగాణలో రోజుకు 1.7 కోట్ల కోడిగుడ్లను వినియోగిస్తుండగా..అందులోహైదరాబాద్‌లోనే 55లక్షల కోడి గుడ్లను లాగించేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోనే గుడ్ల వినియోగం ఎక్కువగా ఉంది. మరోవైపు పక్కనే ఉన్న ఏపీలో మాత్రం కోడిగుడ్ల తలసరి వినియోగం 119 మాత్రమేనని నెక్ నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో 123 కోడిగుడ్ల తలసరి వినియోగంతో తమిళనాడు రెండో స్థానంలో ఉండగా మూడోస్థానంలో ఏపీ, తర్వాతి స్థానాల్లో కర్ణాటక, కేరళ, మహారాష్ట్రం పశ్చిమబెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లు నిలిచాయి. చివరిగా తలసరి 12 కోడిగుడ్ల వినియోగంతో రాజస్థాన్ ఈ జాబితాలో చివరన ఉంది.

కలుషిత రాజకీయాలు దేశానికి ప్రమాదం

- మాజీ ఎమ్మెల్యే శివరామిరెడ్డి సంతాప సభలో నారాయణ



హైదరాబాద్ : నేటి తరం రాజకీయ నాయకుల ప్రసంగాలు, విమర్శలు, వ్యవహారశైలితో రాజకీయాలు కలుషితమైనాయని, ఇది దేశానికి ప్రమాదం అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే శివరామిరెడ్డి గొప్ప నైతిక విలువలున్న వ్యక్తి అన్ని కొనియాడారు. ఆదివారం హైదరాబాద్ కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నాయకుడు,మాజీ శాసనసభ్యుడునర్రెడ్డిశివరామిరెడ్డి సంతాప సభలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా నారాయణ, సీపీఐ ఏపీ కార్యదర్శి, కె రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర సీపీఐ సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఫౌండేషనకార్యదర్శి చెన్నకేశవరావు,సభ్యురాలు డాక్టర్ రజని, సీపీఐ శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్యదర్శి శ్రీశైలం గౌడ్ తదితరులు శివరామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఇంటిముందు రంగవల్లులు..
ఇంటినిండా బంధుమిత్రులు

సంక్రాంతి పండుగ సంబురాలతో కళకళలాడుతున్న తెలుగునాడు

- నేడే భోగి మంటల వెచ్చదనాలు.. పిండివంటల కమ్మదనాలు
- రేపు మకర సంక్రాంతి.. ఎల్లుండి కనుమ
- సంక్రాంతిని పెద్ద పండుగా పిలుచుకుంటారు



జనగామ డిసెంబర్ (మనం న్యూస్ ప్రతినిధి) : సంక్రాంతి అంటే చల్లటి గాలుల నడుమ, పచ్చని పైరుల నడుమ,ప్రతి గ్రామం, ప్రతి ఇల్లు ధాన్యంతో రాసులతో నిండి ఉంటాయి. డూడూ బసవన్నల నృత్యాలు, గంగిరెదు లోళ్ల విన్యాసాలు ఉశోదయాన్నే హరివిల్లుతో హరిదాసులు చేసే గజ్జల చప్పుల్లతో, బంబం అనే జంజర దేవరులు, హంగామాతో హాస్యాన్ని పండంచే పగటి వేషగాళ్లు,మాయింటికి రండి అని స్వాగతించే గొబ్బెమ్మల స్వాగతాలు, నృత్యం చేస్తున్న అమ్మాయిలు, గాలి పటాలు ఎగరవేసి సందడిచేసే పిల్లలు ముంగిట్లో ఇంద్రదనస్సుతో సంబారాన్ని అశ్చర్యంచేసే రంగవళ్లులు, పందెం రాయుల్ల పౌరుషానికి పదును పెడుతూ వేసే కోడిపందాలు , చిట్టి పొట్టి పాపల బుడిబుడి అడుగులు కొత్తగా పెళ్లిల్లు అయిన జంటలు ఇలా అందరి సమక్షంలో బొమ్మల కొలువులతో బోగిమంటల చాటున చల్లని ఉదయాన్ని ఆశ్వాదిస్తూ పాత వస్తువులను, కష్టాలను బోగిమంటలకు సమర్పిస్తూ చిన్నారులకు బోగి పళ్ల పోస్తు ఇబ్బందులు, ప్రమాదాలు ఇలా ఏమి జరగకుండా అందరు సుఖ సంతోషాలతో కలిసి ఉండాలి. ప్రతి ఇల్లు ఒక హరివిల్లులా మారాలి అదే అసలై న సంక్రాంతి పండుగ.అందమైన ఆనందమైన జీవితాల్లో తొలి కాంతి. అసలు సంక్రాంతి అంటే పురాణాల సాక్షిగా సంకురమణం. అంటే మార్పు చెందడం. సంవత్సరానికి 12సంక్రాతులుంటాయి.సూర్యుడు మేషాది ద్వాదశి రాశులయందు క్రమంగా పూర్వారాశి నుండి ఉత్తరరాశిలోకి ప్రవేశిస్తాడు. సూర్యుడు పుష్యమాసంలోని హేమంత ఋతువులో సీత గాలులు వీస్తూ మంచు కురిసే కాలంలో సూర్యుడు మకర రాశి లోకి మారగానేమకర సంక్రాంతికి ఎంతో ప్రాధాన్యత, ప్రాముఖ్యత కలదని, ఈ మాసంలోని సంక్రాంతి రోజున సూర్యుడు ఉత్తరాయణ పదంలో అడుగు పెడతాడు. ఈ రోజునుండి స్వర్గ దారాలు తెరిచి ఉంటాయనిపురాణాల్లో రాసి ఉందని పెద్దలుమాట్లాడుకుంటారు. పంట చేతికొచ్చిన ఆనందంలో రైతన్నల కళ్లల్లో విరిసే కోటి కాంతుల కోలాహాల ఆనందంతో ఈ పండుగను మూడురోజులుగా జరుపు కుంటారు. సంక్రాంతికి ముందు రోజు బోగ భాగ్యాలను ఇచ్చేది బోగి పండుగ అని,రెండవది అసలైన పండు గగా సంక్రాంతి పండుగగా నిర్వహించుకుంటారు. సంక్రాంతికి మరుసటి రోజు కనుమ పండుగను తెలుగువారు ఘనంగా నిర్వహించుకుంటారు. అందుకే దీనిని తెలుగువారు పెద్ద పండుగ అని పిలుచుకుంటారు.



బోగి పండుగ ప్రత్యేకం

సంక్రాంతి తెలుగువారికి ఒక పెద్ద పండుగ పేరు మారిన ఆసేతు హిమాచలం ఆరోజులను విశేషంగానే జరుపుకుంటారు. సూర్యోదయానికి ముందు వేసే బోగి మంటలంటే ఇష్టం లేనివారు తెలుగు వారిలో ఎవ్వరు ఉండరు. గజగజ వనికించే చలిలో వెచ్చగా బోగి మంటల కాంతిలో పిల్లల కేరింతలను, బోసినవ్వులను వెలకట్టలేవము. బోగి అంట మంటలేనా కాదని చెపుతుంది శాస్త్రం. బోగిఅంటే బోగ భాగ్యాలపండుగ.భోగము, సుఖానికి కారణమైందే ఈ పండుగ. దక్షయానికి ఆకరి రోజు, సంక్రాంతికి ముందు రోజు చేసేదే ఈ బోగి పండుగ శరీర సుఖంకోసం, పోషణ కోసం,. ధనాన్ని చేకూర్చే రోజులు కాబట్టి పండుగను బోగి అని పిలుచుకుంటు వస్తున్నాయి పురాణాలు. లౌఖిక కామాన్ని కాల్చేసి, భక్తి మార్గాన నడుస్తామని చెప్పడమే బోగి మంటల పరమార్ధం. ఆ కాంతిలో జ్ఞాన మార్గంలో నడవమని అర్ధం. ఈ రోజు ఆవుపేడలతో చేసిన పిడకలను కామానికి గుర్తుగా మంటల్లో కాల్చిబూడిద చేస్తారు. హేమంత ఋతువులో బోగి వస్తుంది. రేగుపండ్లు దొరికే రోజులివి.ఈ కాలంలో రేగు పండులో అమ్మవారు నిక్షి ప్తమై ఉంటుందనివారి నమ్మకం.ఇందుకుగా రేగు పండ్లు, చిల్లర డబ్బులు, బంతి పూలు, చెరుకు ముక్కలు కలిపి పిల్లల నెత్తిన పోస్తారని పురాణాల్లో ఉన్నట్లు చరిత్ర కారులు చెపుతుంటారు. బోగి పండ్లు చిన్న పిల్లల నెత్తిన పోస్తే జాతక దోషాలు, అనారోగ్యాలు, భాదలు పోతాయని చెపుతుంటారు. దక్షణాయాణ కాలంలో చేసే శ్రావణ.,కార్తిక, దనుర్మాస వ్రతాల పుణ్య పలం సంక్రాంతిలో వచ్చే ఉత్తరాయణంలో ప్రాప్తిస్తుందని చెపుతుంటారు. ఇందుకుగా దక్షణాయణ కాలానికి బోగి మంటలతో వీడ్కోలు పలుకుతారు.

అమ్మపేరే నా కవిత్వం

ఏ కవైనా, రచయితైనా తన జీవితం చవిచూసిన అనుభవాల నుంచో, అనుభూతుల నుంచో, వివిధ సంఘటనల నుండో ఏదో ఒక విషయం తీసుకుని, దానికి తమవైన తాత్విక చింతనలు, కల్పనలు జోడించి సాహిత్యంగా ప్రపంచానికి అందిస్తారు. అనుభవం నుంచి పలువరించినప్పుడు పురుడుపోసుకున్న కవిత్వానికి, ఊహాత్మకంగా చెప్పిన సాహిత్యానికి ఆర్ద్రతలో, అభివ్యక్తిలో తేడా స్పష్టంగా ఉంటుంది. ఆనాడు దళిత వేదనలో మగ్గి ప్రసవించబడిన గబ్బిలం కావ్యమైనా, తాడిత పీడిత కన్నీటి చారికలు అనుభవించి శిగమెత్తిన మహా ప్రస్థాన గీతాలైనా, గుండె లోతుల్లోని తడిని అద్దుకుని పుట్టినవే. అలాంటి హృదయ వేదన, సంవేదన నుంచి పుట్టిన కవిత్వం యువ కవి 'కుంచె లక్ష్మీ నారాయణ' కలం నుండి అక్షరీకరించబడిన భావోద్వేగమైన కావ్యం, గత తాలూకు స్మృతిని, వర్తమాన భవిష్యత్ కాలాలలో తల్లీ కొడుకుల అనుబంధాలకు, విలువలకు ప్రతిరూపంగా నిలిచి అనురాగాన్ని, సందేశాన్ని మోసుకొచ్చిన కావ్యం 'అమ్మ పేరే నా కవిత్వం'. ఈ కవితా సంపుటి అణువణువునా అనుభూతి నిండిన నోస్టాల్జియా, ఆర్థత నిండిన కవిత్వం ఉన్నది. ఈ సంపుటిని ఒక రకంగా పాఠకుడు తల్లీ కొడుకుల కథగా, కావ్యంగా అనుభూతి చెందుతాడు.

సాధారణముగా ఒక కవితను చదివేటప్పుడు అనుభవజ్ఞులు శిల్పం కోసం వెతకడం పరిపాటి. శిల్పాన్ని అందంగా చిత్రీకరించకపోతే అందులో పస లేదని విమర్శకులు తేల్చేస్తారు. కానీ ఒక వస్తువు శిల్పంతో సంబంధం లేకుండా, ప్రతీ మనసును అర్థతతో నింపేది ఏదైనా వుంది అంటే, ఆ వస్తువుకు రూపం అమ్మ. మరి వస్తువు, శిల్పం రెండూ అమ్మే అయితే, ప్రతీ పాఠకుడికి ఆ కవిత్వం అమ్మ పాడిన జోలపాటే. 'చందమామ రావే జాబిల్లి రావే' అని ఎన్ని సార్లు కవితల్లో చూసినా, ప్రతీ సారీ ఓ కొత్త అనుభూతి, మనసును పసితనపు అమ్మ ఒడిలోకి తీసుకెళ్లి వదిలేస్తుంది. అలాంటిది దాదాపుగా ఒక కవితా సంపుటి మొత్తం అమ్మే వస్తువుగా, శిల్పంగా సాగితే, అది పాఠకుడిని తిరిగి తన మాత మూర్తి పొత్తిళ్ళలో తాను ఉమ్మ నీటిలో ఉన్నప్పుడు, అమ్మ చెప్పిన కథల దగ్గరి నుంచి, చేయి పట్టుకుని నడిపిన బాల్యాన్ని, గోరు ముద్దలను, లాలి పాటలను హృదయాంతరాలలో పలికిస్తుంది. అలాంటి కావ్యానికి చిరునామా 'అమ్మ పేరే నా కవిత్వం'. ముఖ్యంగా పల్లెటూరిలో పెరిగిన బాల్యానికి ప్రతీకగా కవితా వాస్తుశిల్పం సాగింది. పచ్చని పంట పొలాల నడుమ పెరిగిన వారు, ఈ కవిత్వాన్ని చదువుతున్నంత సేపు తమ బాల్యంతో తాము నడిచి వెళ్తున్న అనుభూతిని పొందుతారు. అయితే ఈ కవితా సంపుటికి ఉన్న ప్రత్యేకత 'నవ మాసాలు మోసిన అమ్మకు, కొడుకే అమ్మైన సందర్భం'. ఈ సంపుటిని చదువుతున్నప్పుడు పాఠకున్ని, రెండు ఆత్మల్లోకి పరకాయ ప్రవేశం చేపిస్తాడు కవి. ఒకటి పాఠకుడి బాల్యం ఒడిలోకి, గత స్మృతుల్లోకి. రెండు కవి బాల్యంలోకి, జీవితంలోకి. అప్పటి వరకు వస్తువులోని అమ్మను తన అమ్మగా, కవి బాల్యాన్ని తన బాల్యంగా ఊహా ప్రపంచంలో విహరిస్తున్న పాఠకుడిని, 'అమ్మ చేయి అలిగింది' అన్న కవిత నుంచి తనదైన ప్రపంచంలోకి తీసుకెళ్తాడు కవి. ఇందలి సంపుటిలో నాన్న వస్తువుగా కొన్ని కవితలు సాగినా, అవి అంతర్లీనంగా తల్లి యొక్క సంవేదనను తెలియజెప్పేవే. అమ్మతో నేను అనే కవితలో 'తన కడుపుకు తానే కాపరై' అనడం ద్వారా కాపరి అన్న పదానికి మరో భాష్యం చెప్పారు కవి. 'తన హృదయంతో నా హృదయానికి రక్త సంబంధాన్ని జోడిస్తూ' అనడం కవి అంతరాలలో దాగిన ఆత్మబంధానికి నిదర్శనం.ఓ చోట 'నా ఊతం లేని పరుగు చూపి తాను విజయం సాధించిన ఆనందం' అనడంలో పుత్రుడు స్వతంత్రుడైతే తల్లి కళ్ళలో మెరిసే కాంతిని అందంగా చిత్రించాడు కవి. కన్న పేగు కవిత పాఠకులను నీలాకాశంలోని నక్షత్రాల సాక్షిగా అమ్మ గోరు ముద్దలు తినిపించే నోస్టాల్జియా. ఎన్ని సార్లు విన్నా, ఎన్ని మార్లు చూసినా తనివి తీరని అమ్మ పద ముద్దలను ఈ కవితలో జొప్పించాడు కవి.

చిరిగినా చొక్కా కవితలో 'నేను ఇంటికి మోసుకెల్లేది/ రేగి చెట్ల జ్ఞాపకాలు/ కంప చెట్ల గుర్తులు' అని అభివ్యక్తీకరించడం పల్లెటూరి బాల్యానికి నిదర్శనంగా నిలుస్తూనే, ఈ నాటి పట్టణాలలోని పిల్లలు ఏ ఏ జ్ఞాపకాలను, అనుభూతులను కోల్పోతున్నారో చెప్పే సందేశాన్ని చెప్పకనే చెప్పాడు కవి. ఇదే కవితలో అమ్మ చేతి 'కణికట్టుతో' అనే పదప్రయోగం పాఠకుడి హృదయంలో ఎన్నో అనుభూతులను పల్లవింపచేస్తుంది.అమ్మే మొదటి గురువు, స్నేహితురాలు అని చెప్తూ, బాధ్యత నేర్పే నాన్న కూడా అన్న సందేశం ధ్వనించేలా పండగొస్తే అన్న కవితను హృద్యంగా చిత్రీకరించారు. నా తొలి విజయం అను కవితలో వాడిన ప్రతీకలు అందంగా ఉండడమే కాక, అమ్మే తొలి గురువు అన్న నిజాన్ని ప్రభోదిస్తున్నాయి. మనసులో కోరికను గట్టిగా అనుకుంటే, ఈ ప్రపంచమే నీకు తోడుగా వస్తుంది అన్న మాటలను నిజం చేసేలా, బూగంప కవితలో 'బోర్లో నీళ్లు దుంకుతాంటే/ నీళ్లను ఆపుదామనే నా ప్రయత్నం / ఫలించిందని తెలుసు కాబోలు/కరెంటు పోయేది నాకు సహాయంగా' అనడం కవిలో బాల్యం తాలూకు పసితనం ప్రభావం ఎంతగా ఉందో అర్థం చేసే ఖండిక ఇది. ఈ కవితా సంపుటిలో అమ్మ గర్భంలో తనో జీవంలా రూపాంతరం అవుతున్న క్షణం నుంచి, అమ్మతో కలిసి కనులు తెరవడం, అమ్మ చేసిన మురిపెం, పిల్లాడి కేరింతలకు అమ్మ కంట మెరిసిన చెమ్మ, లాలి పాటలు, పంట పొలాలు, యేటి గట్లు, బాయి కాడి చింత తొక్కు బువ్వ, జిమ్మి చెట్టు కింద తల వార్చిన పసితనం, ఎడ్ల బండిపై పచ్చని పొలాల మధ్య సాగే ప్రయాణాలు, దేవుని దర్శనానికంటూ కొండలపై పరుగులు, అమ్మ చేతి స్పర్శ శ్వాసను హృద్యంగా చిత్రీకరించారు కవి. 'చంటి పిల్లాడి ఏడుపులోని/ స్వరం అమ్మ కాదంటారా?' అని ప్రశ్నిస్తూ, అమ్మ పేరునే తన కవిత్వంగా మలిచారు కుంచె.అమ్మ పాడిన జాబిల్లి పాట ఆద్యంతం హృద్యం. ఓ చోట సూర్యుణ్ణి పిల్లాడితో పోల్చి, భూమిని అమ్మతో పోల్చి, చక్కని పోలికలను ఆవిష్కరించారు. అప్పటి వరకు తండ్రి, భర్త ప్రపంచంగా ఉన్న ఆమెకు, అమ్మ అయ్యాక ఆ బిడ్డే ప్రపంచమనే అంతర్లీన సహజ భావాలను ప్రకటించారు. ఓ చోట 'ఉషోదయ కిరణాలను అమ్మ మాటల తాకిడితో' పోలిక చేయడం మంచి ప్రతీక. దారి పొడవునా అమ్మ జ్ఞాపకాలు అనే కవిత ఇటు వర్తమానంలో, అటు స్మృతిలో అమ్మ జ్ఞాపకాలతో సాగే చక్కని కవిత. అమ్మ చేయి అలిగింది అనే ఖండిక నుంచి పాఠకుణ్ణి తన ఆత్మలోకి పరకాయ ప్రవేశం చేయిస్తాడు కవి. పై కవితలో సూర్యుణ్ణి భూమిని తల్లీ కొడుకలతో పోల్చినట్లు, రచయిత తల్లిని తన తల్లిగా, రచయితను తానుగా అనుభూతుని పొందే అర్థత మొదలవుతుంది పాఠకుడికి. అదే సమయంలో తల్లిదండ్రులను తమ మానానికి తమను వదిలేసిన నిర్దయ కలిగిన పుత్రులకు ఈ ఖండికలు చెంప పెట్టు.ఈ కవితలో 'అమ్మ చేతి వంట లేక/బతకడం కోసం తిన్నట్లుంది' అనడం అమ్మే ప్రపంచంగా పెరిగిన ప్రతీ తనయుడికి ఆర్థత గాఢత కలిగిన చిత్రం.' అమ్మ ఋణం' అమ్మకు అమ్మగా మారిన క్షణం అంటూనే, నా జన్మ ద్వారం కవితలో 'నా జన్మ ద్వారం/ నా చేతి వేళ్ళకు తగిలితే / నా శరీరం జలదరించింది' అని వర్ణించడానికి వీలు కాని, అది అదృష్టమో దురద ష్టమో చెప్పలేని విచలిత విపత్కర పరిస్థితిలోకి పాఠకుడిని నెట్టివేస్తాడు. ఏదో ఓ సమయంలో ప్రతీ పాఠకుడు తన తల్లిని, తల్లి ఆరోగ్యాన్ని గురించి ఆలోచింపజేసేలా ఈ ఖండికలు ఇటు అర్థతనే కాదు, ఇటు సమాజహితాన్ని మోసుకొచ్చాయి. ఎగిసిన భావోద్వేగాలను శాంతింపచేయడానికి కవి చేసిన వ్యూహాత్మక ప్రయోగమో, మరేదో తెలియదు కానీ నిశ్చలమైన అమ్మ కవిత నుండి పాఠకుడి భావోద్వేగాన్ని తిరిగి నిశ్చలమైన స్థితిలోకి తీసుకొస్తాడు కవి. అమ్మను, అమ్మ ప్రేమను ఎన్నో ప్రతీకలతో,పోలికలతో ఈ కావ్యంలో అక్షరీకరించారీ యువకవి. అరుణోదయంగా, గొడుగుగా, గడియారంగా, సూర్య చంద్రుల వెలుగుగా అభివ్యక్తీకరించారు. అమ్మ ప్రేమనే కాదు, ఆ అమ్మ పలుకులకు కారణమైన అమ్మ భాషనూ 'నాతోనే నాలోనే అమ్మ భాష' అంటూ 'అమ్మే నాలో నిండిపోయిన శ్వాస' అన్న అభివ్యక్తి కవిలో అణువణువునా పరిమళిస్తున్న, స్మరిస్తున్న అమ్మ తత్వానికి నిదర్శనం. ఇలా అమ్మే వస్తువుగా, శిల్పంగా, అభివ్యక్తిగా రూపుదిద్దుకున్న ఈ కావ్యం ప్రతీ పాఠకుడికి ఎదో సమయంలో తన తల్లిని, బాల్యాన్ని గుర్తుకు తెచ్చి కనుల వెంట కన్నీటి చెమ్మలను మెరిపించ గలదు. ఆ పొరలో తనదైన వాస్తవిక ప్రపంచంలో పాఠకుడు తన తల్లిని ప్రతిష్టించుకోగలడు.ప్రతి ఒక్కరూ చదవాల్సిన అందమైన కావ్యం,అమ్మ లాంటి కావ్యం 'అమ్మ పేరే నా కవిత్వం'.

> **అమ్మ ప్రేమనే కాదు, ఆ అమ్మ పలుకులకు కారణమైన అమ్మ భాషనూ 'నాతోనే నాలోనే అమ్మ భాష' అంటూ 'అమ్మే నాలో నిండిపోయిన శ్వాస' అన్న అభివ్యక్తి కవిలో అణువణువునా పరిమళిస్తున్న, స్మరిస్తున్న అమ్మ తత్వానికి నిదర్శనం. ఇలా అ మ్మే వస్తువుగా, శిల్పంగా, అభివ్యక్తిగా రూపుదిద్దుకున్న ఈ కావ్యం ప్రతీ పాఠకుడికి ఎదో సమయంలో తన తల్లిని, బాల్యాన్ని గుర్తుకు తెచ్చి కనుల వెంట కన్నీటి చెమ్మలను మెరిపించ గలదు. ఆ పొరలో తనదైన వాస్తవిక ప్రపంచంలో పాఠకుడు తన తల్లిని ప్రతిష్టించుకోగలడు.**



◆ **పరవస్తు విశ్వక్సేన్**
8328384951

రైతుల పెద్ద పండుగ

వర్షపు జల్లులు మొదలయ్యాయి
జోరున జల్లులు వరదలై పారింది....
పొలం పొత్తిళ్ళలో పొద్దులను దున్నుకుంటూ
స్వేదాన్ని చిందిస్తూ పంటలను పండిస్తూ....
పంట పరవళ్ల దొక్కే అవధులు లేని ఆనంద
పరవళ్లలో....
ధాన్యలక్ష్మి దరహాసం చేయగా
కొత్త పంట దరిచేరగా...
ప్రకృతి శోభను సంతరించి
ప్రతిధ్వనించింది నాపల్లెటూరు...
పచ్చని పంట పొలాలు
కల్మషం లేని పసిడి మనసులు....
ఆత్మీయతలే ఆస్తులుగా మసలుకొనే
అనురగాల లోగిళ్ళు....
కట్టు బొట్టు సంప్రదాయానికి పెట్టింది పేరు
నా పల్లెటూరు....
పసిడి పంటల పల్లె ముస్తాబయ్యింది
సంబరాల సంక్రాంతికి....
పంట చేతికొచ్చిన రైతన్న సంతోషంలో
సంక్రాంతికి సకలదేవతలను ఆహ్వానించగా....
ముక్కోటి దేవతలకు హరివిల్లు
కుసుమాలతో స్వాగతం పలికగా....
మదిలో ఆనంద సమ్మేళనాన్ని ముడేసుకో
మంటూ వచ్చేసింది వెలుగుల సంక్రాంతి....
కూతుళ్ళు, అల్లుళ్ళు, మనవళ్ళు, మనవరాళ్ళతో
ఇల్లిల్లూ ఆనందాల లోగిలై....
పచ్చని కల్యపు జల్లి ముత్యాల ముగ్గులతో
బొమ్మరిల్లును తలపించే నా పల్లెటూరు...
పొగలాంటి మంచులో వెచ్చనైన బోగిమంటలు
చూడు...
మధుర అనుభవాలను పంచేందుకువచ్చే మకర
సంక్రాంతిని చూడు...
కష్టాలను మరిపించే కనుమ వచ్చెను చూడు...
కత్తులు దూసే కోడిపుంజులు, గగనాన విహ
రించే పతంగులు, డూడు బసవన్నలు, హరి
దాసు సంకీర్ధనాలు, తలతలలాడే పట్టు వస్త్రా
లు, బావ మరదల్ల చిలిపి చేష్టలు, కొత్త అల్లుళ్ళ
ప్రేరణలు, కమ్మని పిండివంటలు....
అంబరాన్ని తలపించేలే ఈ పెద్ద పండుగ....
దేవతలందరి దీవెనలతో దేదీప్యమానంగా జరి
గేలే పసందైన సంక్రాంతి....
నీలిగగనం ఈ సుందర దృశ్యాలను చుస్తూ
చిరునవ్వు చిందించగా....
నా పల్లె అష్ట ఐశ్వర్యాలతో శాంతి సుభిక్షం కావా
లని కోరుతూ....
ఇంత తీయగా ఉంటుంది గనుకనే నా పల్లె
జ్ఞాపకాలను ఎన్నటికీ మాసిపోనీయను....

- శివేగారి చిన్నికృష్ణ
6300318230

రైతింటి పండుగ

నష్టాలతో పూడిన
గుండె లోతుల్నిదున్ని తీసి
చెమట చుక్కలతో మట్టి తడిపి
లేని ఓపికను విత్తనాలు చేసి
రేపటి కలలను నారుగా పోసి
అల్ప పీడన ముప్పులు
అతివృష్ఠి తిప్పలు తప్పించమని
అప్పులకుప్పలు తరిగే ముడుపులు
తిరిగే మేఘపు మెడలకు కట్టి
గాలిపటమైన చూపులతో ఎదురుచూసేవేళ
ఏ హరిదాసుల దీవెనలో
ఏ జంగమదేవర ఆశీస్సులో
ధాన్యరాశిగ కురిసి
వాసిగ సంక్రమించిన వేళ
పల్లెతల్లి ఇల్లు పరవశిస్తుంది!
భోగభాగ్యాలతో గాదెలు నిండి
సంక్రాంతి శోభ వెల్లివిరుస్తుంది!

- డేగల అనితాసూరి
9247500819



ప్రకృతి... పండుగ

శ్రమజీవి అలసటను ఆసాంతం మరిచి ఇంటిలో
కొలువుదీరిన ధాన్యలక్ష్మిని ఆస్వాదించే ఆనంద
సమయం
సంధ్యా సమయాన గూడు చేరిన పిచ్చుకల
కిచకిచ రావాల ఆప్యాయత పలకరింపుల అవ
ర్ణిణితా భాష్యాల ఆవిష్కరణా ద శ్యం
భారాల బాధలను విడిచి దూరాల బంధాలు
సంతోషాల మూటలతో రెక్కలు కట్టుకొని
వాలిపోతాయి
ముడుచుకు పోయిన ఆనందాల మూటవిప్పి
ముచ్చటతో విప్పారిన నవ్వుల పువ్వుల
సుగంధాలు మది తలుపులను ఉల్లాసంతో
తెరుస్తాయి
పట్టు పరికిణిల పడుతులు చలిని ఒళ్ళంతా
కప్పుకొని హాయిగొలుపు నిశ్వాసలు
రంగుల ముగ్గులై ఇంటిముందు పందిళ్ళై
పరుస్తారు 'సన్' క్రాంతిని ఆహ్వానిస్తూ....
అళ్ళుల్లు ఆపడుచుల సందడి ఊరంతా అలికిడి
వ్యాపించే సరదాల సన్నాయి రాగాలు
గొబ్బెమ్మలు గొంతెత్తి తీయని సంక్రాంతి
స్వరాలై స్పురిస్తాయి
పిండి వంటల వాసనలు పండగ ప్రారంభ
సంకేతాలు పొరుగు వారికి పంపి ఆనందాల
హరివిల్లుల పొదరిండ్లై ఆహ్లాదభరిత వెచ్చని
ఆవిర్లు అలుముకుంటాయి
పురివిప్పిన మయూరమై ప్రతి వాకిట పండగ
ఉత్సాహపు ఉల్లాసాలు ఒంపుతుంది సంతోషాల
వెలుగులు సంక్రాంతి నింపుతుంది

- కొప్పోలు యాదయ్య, 9494273703

సంక్రాంతి శోభ

గొబ్బెమ్మలు, రేగు పళ్ళు
సిరి ధాన్యాలతో
హరివిల్లులను మరిపించే
రంగవల్లులతో
కళాక్షేత్రాలయ్యే ఇంటింటి ముంగిళ్ళు.
హరిదాసుల కీర్తనలు
బసవన్నల నాట్యాలు
తరతరాల తెలుగు సంస్క తిని
చాటిచెప్పే జానపద కళారూపాలు.
మనో మాలిన్యాలను
మానసిక జాడ్యాలను
వదిలించుకోవాలని సూచించే
భోగి మంటలు.
చిన్నారులను
నిండు నూరేళ్ళూ జీవించమని
ఆశీర్వదించే భోగి పళ్ళ ఉత్సవాలు.
కొత్త అల్లుళ్ళు
బావ మరదళ్ళ సరస సల్లాపాలు
కొత్త ధాన్యం
చక్కెర పొంగళ్ళతో
నవనవలాడే ఇంటి లోగిళ్ళు.
కోడి పందాలు
కోడెల అందాలు
గాలి పటాల గలగలలు
పిన్నా పెద్దల కేరింతలతో
అంబరాన్నంటే సంబరాలు.
పల్లె ప్రియురాలి అందాల వీక్షణకై
పట్నం ప్రియుడి పయనాలు.
సంక్రాంతి శోభను చూసి
తరించే నయనాలు.

- సింగారపు రాజయ్య
9945744332

తెలుగు అక్షరాలకు సెలవు ఉంటుందా..!

కవిత చదవగానే మనసుకు ఏదో ఒక ఏమోషన్ కలగాలి. రీడర్ స్పందించకపోతే కవి కవి త్వం రాసి ప్రయోజనం ఏముంటుంది? ఔను నిజమే కవిత్వం కవి సంతృప్తి చెందడానికి రాసుకుంటాడు. కానీ తాను మాత్రమే సంతృప్తి చెందాలనుకుంటే ఎలా? యువకులు, సమాజం పట్ల అవగాహన ఉన్నవారు సామాజిక కవిత్వాన్ని, అభ్యుదయ కవిత్వాన్ని రాసి కవితా ప్రేమికులను కట్టిపడేయాలి. అలాంటి కవిత్వం రాస్తున్న అతి కొద్దిమంది కవులలో 'అక్షరమాలి సురేష్' ఒకరు.

కవిత్వం ఒక సంఘటన కాకూడదు. కవిత్వం సంఘటనలపై మాత్రమే రాస్తున్నట్లు అయితే అక్కడ పూర్తి శాతం కవిత్వం వస్తోందని మాత్రం చెప్పలేను? కవిత్వం రాయాలంటే రాసే వస్తువుపై సమగ్ర సమాచారం ఉండాలి, సంఘటనను అనుభవించి ఉండాలి, దగ్గరిగా గమనించైనా ఉండాలి అప్పుడే కవిత్వం నిగనిగలాడుతుంది. కవిత్వ పాదాల లోతుల్లో వెతికే కొద్ది కవిత్వ ఊట రీడర్ దాహాన్ని తీర్చాలి. అప్పుడే ఆ కవి యొక్క కవిత్వం కనురెప్పల గుమ్మానికి పచ్చని తోరణమై వేలాడుతుంది.

లైఫ్ హాలిడే శీర్షికతో మనముందుకు వచ్చిన కవితా సంపుటిలోని కవితలు అనుభవం లోంచి, నిజజీవిత సంఘటనలలోంచి, బాధలు, కష్టాలు, ఒడిదుడుకులు, సంతృప్తి, జ్ఞాపకాల నుండి రాసినవే. ఇందులోని కవితలు ఎవరికోసమో, దేనికోసమో, ఎవరి మెప్పు కోసమో రాయలేదు. ఒక గాయం నుండో, ఒక దెబ్బ నుండో, ఒక ఆనందం నుండో వచ్చాయని చెప్పగలను. వచన కవిత్వం పలచపడిపోతున్నా నేటికాలంలో ఇలాంటి పుస్తకాలు పరభాషా కవిత్వాన్ని శాశిస్తూనే ఉంటాయి.

పుస్తకంలోకి వెళ్తే 'శకలాల మూట' శీర్షికతో రాసిన కవితలో కవి ఇలా అంటారు 'నా కల పల్లె కనుపాప మీద నావలా సాగిపోతూ ఉంది' అంటూ పల్లెలోని తన జ్ఞాపకాలను నెమరేసుకున్న సందర్భంలోంచి వచ్చిన కవిత. పల్లెను నగరం ఏ విధంగా నాశనం చేసిందో చెప్తూనే పల్లె గుర్తులను మన గుండెలపై పచ్చని ముద్రలు వదులుతాయి. 'రాయి రాయి ముద్దాడి నిప్పుకు జీవం పోశాయి' అంటున్న కవి అభివ్యక్తీకరణను పరిశీలిస్తే పాత విషయాన్నే కొత్తగా చెప్పడంలో కవిత్వ శిల్పంపై తనకున్న పట్టును తెలియజేస్తుంది.

ఇద్దరు గుద్దుకుంటే గొడవ అంటారు. నేనేమో ప్రేమ అంటాను. ఏ రెండు వస్తువులు లేదా వ్యక్తులు కలవకపోతే సమాజం ఎలా ముందుకు కొనసాగుతుంది? వినాశం అంటాము కానీ దాని తర్వాతే ఒక కల చిగురిస్తుంది. పచ్చగా జీవితాన్ని ముందుకు సాగేలా చేస్తుంది. 'మా అవ్వ మా ఊరి చరిత్ర పుస్తకం' ప్రతి పల్లెకు ఒక అవ్వ ఉంటుంది. ఆమె ఆ గ్రామ ప్రజలందరికీ అవ్వే!ఆమె నుండి ఒక చరిత్రే ఏమిటి? సమస్తం నేర్చుకోవచ్చు. నేడు వృద్ధులను చించేస్తున్నారు. పైగా చింపితే చినికిపోయే చరిత్ర ఎందుకు పనికొస్తుందనే ప్రశ్న మానవ జీవితాలను, జీవిత విధానాలను పెకలించి వేస్తోంది.

'ఆకలి! పూటపూటకు పలకరించే అతిథి' ఈ అతిథికి పేద, ధనిక అని తేడ ఉండనే ఉండదు. ప్రతి కడుపు గడపను ప్రతీపూట తడుతూనే ఉంటుంది. మనిషి దుఃఖ సముద్రంలో మునుగుతున్నా, ఆనందాల అలలపై దోబూచులాడుతున్నా! ఎక్కడున్నాడో? ఎలా ఉన్నడో? ఏం చేస్తున్నాడో ఆకలనే అతిథికి అవసరమే లేదు తలుపు తీసే వరకు, కడుపు నింపే వరకు తట్టి తట్టి లేపుతుంది. అతిథి సత్కారాలు చేయని పేద ప్రజల పక్షాన నిలబడే అక్షరమే ఈ అక్షరమాలి కవిత్వం.

రాయలసీమ ఒకప్పుడు రత్నాల సీమ ఇప్పుడు కనీసం సీమరైతు కంట్లో ఒక్క నీటి బొట్టు కూడా కనపడదు. ఎందుకంటే అక్కడ ఎవరు గుర్తించని, ఎవరికీ తెలియని ఒక పెద్ద ఎడారి విస్తరించింది. ఇప్పుడు సీమ మాత్రమే కాదు సీమరైతు దేహంలో కూడా కన్నీటి కరువే. ఇదే విషయాన్నీ 'మనది కాకుండా పోతున్ననది' అనే శీర్షికలో వేదనాభారితంగా కవి మనకు తెలియజేశారు.

కవిత్వాన్ని రాసే వారు చాలామంది ఉంటారు కానీ ఇతను కవిత్వాన్ని లిఖించాడు. తెలుగు సాహిత్య చరిత్రలో అక్షరమాలి లిఖించిన కవిత్వం చిరస్థాయిగా నిలుస్తుందని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. మరిన్ని కవిత్వ సంకలనాలు తన కలం నుండి రావాలని కోరుకుంటూ తెలుగు కవిత్వం అంటే ఇది అని తెలియజేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ కవికి శుభాకాంక్షలు.

◆ **కటిక హైమవతి**
విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు

నవ యువ కవితా కెరటం 'వెన్నెల సత్యం'

చెట్టుకెప్పుడు మనిషి చేటు జేసిన గాని
తాను మేలు జేయు తప్ప కుండ
స్వార్ధమింత లేని సార్ధకతకు గుర్తు
వెన్నెలమ్మ మాట వెలుగు బాట!

ఈ పద్యం చదువుతుంటే పాఠకులు మరొక్కసారి బాల్యంలోకి వెళ్లక తప్పదు. కవిత్వం ద్వారా సాహిత్యా మంతా రాశామంటే కుదరదు. అంటే కేవలం కవిత్వం రాయడం కాదు ఒక్కొకవి ఒక్కొ రకంగా సాహిత్య గరిమ తిప్పడానికి ప్రయత్నిస్తాడు. అలాగని అందరు మొత్తం సాహిత్యం రాయలేరు. రాసే ప్రయత్నం చేసేవారు లేకపోలేదు. చెయ్యాలంటు పాఠకులుగా మనందరం కోరుకోవాలి. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు అయిన సత్యం షాద్ నగర్ నుంచి తన కవిత్వం నిత్యం బస్సె యాభై కిలోమీటర్ల సరిహద్దులలో వొంపి వెళ్తుంటాడు. అటువంటి కవిత్వం రాస్తు తన వంతు సాహిత్యసేవ చేస్తున్న కవి వెన్నెలసత్యం.

'దుఃఖగీతం పాడుతుంది / కన్నీటి చుక్క / తుడిచే హస్తం/ దురమయ్యిందని' అనే నానీ ప్రతి జీవికి సంబంధించిన వాస్తవం. కవిత్వం రాయాలన్నా కవిత్వాన్ని ఆస్వాదించాలన్నా పాఠకులకు కొంతైన సాహిత్యాభిరుచి ఉండాల్సిందే. అయితే కవిత్వం మసకబారిన జీవితం నుంచి తనంతట తానే కలాన్ని చీల్చుకొని వస్తుంది. అటువంటి కవిత్వం మంచి చెడులను కొలచి కొంత వరకు భంగపర్చిన సమస్యలపై పోరాడుతుంది. కవి సత్యం కవిత్వంతో పాటు, నానీలు, రుబాయిలు, మణిపుసలు, పద్యాలు, చిన్న చిన్న గేయాలు, బాల గేయాలు, మొదలైన సాహిత్య పక్రియలకు పెట్టింది పేరు. కవిత్వంతో స్నేహం చేస్తు సాహిత్యంతో నిత్యం జీవితం గడుపుతున్నాడీ కవి.

మనసు బాధసంద్రమైనప్పుడు ఓదార్పు నావగా మారుతాడు జీవితం తడారిన ఎడారైనప్పుడు ఆయన సాహిత్య పలకరింపుతో చిరుజల్లుల చెలిమలు కురిపిస్తాడు. నేటి కాలంలో మంచి కవిత్వం రాస్తున్న కవులలో మంచి పేరున్న కవులలో కవి వెన్నెల పేరు ఉందనడం మనం ఒప్పుకొని తీరాల్సిందే. మనసు నిండ జల పాతాలు పారుతున్నట్లు, లక్ష విరుల మకరందాలు కురిసినట్టు, జాబిల్లి నుంచి వెన్నెల నిదానంగా దుకినట్టు, పసిపిల్లల నవ్వులలో జారుతున్నట్టు, ఒక పరిమళం, ఒక కోమలం, ఒక మౌనం, ఏదో మాయ, గిలిగింత, అనురాగ స్రవంతిలో తేలియాడుతున్నట్లు ఒక్కసారి తన కవిత్వం రుచిచుస్తే నిత్యం దినపత్రికలోకి తొంగిచుడడం మరువరు.

ఇంత గొప్ప కవిత్వం రాస్తున్న ఆయనకు దక్కాల్సిన గౌరవం దక్కలేదనే చెప్పాలి. ఇటివలే ఎన్ గోపి గారి చేతుల మీద నుండి అపుర్వ గౌరవం దక్కింది అందుకే తన కలం నుండి నిత్యం జల పాతం వంటి కవిత్వం దుకుతునే ఉంది.

'జీవితం/ ఓ క్రికెట్ పిచ్/మనది తప్ప చుట్టంతా/ పచ్చగానే ఉంటుంది'

అని నానీల కుండను గుమ్మరించాడు. కవులంటే వారికి అన్ని సౌకర్యాలుండవు కవిత్వం రాసిన దానికి పురస్కారాలు రాకపోవచ్చు. అలా అని కవిత్వం రాయకుండా ఉండలేడు కవి. కలంలో విశాలమైన దృక్పథం దాగి ఉంటుంది. అందుకే తను ఎన్ని కష్టాలు పడైన చుట్టూ అంతా పచ్చగానే ఉండాలని ప్రయత్నిస్తాడు. ప్రతి రోజు సమాజం మరో కొత్త లోకంలోకి మాయమవుతున్న నేపథ్యంలో దానికి మేలుకొల్పులా సత్యం గారి కవిత్వం ఉంటుంది. మొదట ఆయన బస్సుకండక్టర్. నిత్యం ఎన్నో ప్రదేశాలు తిరిగి రావడం వలనే కావచ్చు ఇలా కవిత్వం రాయడానికి తోడ్పడి ఉండవచ్చు. ఇటువంటి సమయంలోనే తన కలం నుంచి లేడీ కండక్టర్ కవిత నీరులేని ప్రాంతంలో కుడ మొలకై మొలసింది. ఆయన ప్రత్యక్షంగా చుసిన అనుభవించిన తోటి ఉద్యోగి అవస్థలను వారి బాధలను కళ్లకు కట్టి చుపించాడు

''ఖాకీ దుస్తుల్లో/ కీకారణ్యంలో ఏకాకిలా/
కన్నీటి సముద్రంలా నువ్వుండిపోతే/
ఏ హస్తము నిన్ను ఓదార్చదు''

అందుకేనమ్మా నీ చుట్టూ నువ్వే/
ధైర్యమనే ముళ్ళకంచె నాటుకోవాలి/
పద్మవ్యూహంలాంటి బస్సులో / అపర అభిమన్యురాలివై/ మునుముందుకు సాగిపోవాలి''! అంటు మనల్ని ఆలోచింప చేస్తాడు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని తను జీవితంలో చిన్న జాబుతో ఎంతో ప్రయాసపడి కుటుంబాన్ని సంసారసాగరాలను ఈదుతున్న చాలామంది జీవితాన్ని కళ్లకట్టారీకవి.

బస్సెక్కినప్పటి నుండి దిగేవరకు ఎన్నో కామకండ్లతో నెట్టుకొస్తున్న ఒక స్త్రీ యొక్క ఆవేదన ఆమె బాధను మనంమందరం గమనించే విధంగా రాశా డు. తనొక గొప్ప కవిగా నిలదొక్కుకొనే ప్రయత్నం చేస్తున్నడంటే ఆయనకు ఆ ధైర్యం నురితాగించింది ఖచ్చితంగా వాళ్ళ అమ్మనే అని చెప్పాలి. ఎందుకంటే కింది నానీ చదివితే మనకు ఆయన గురించి సంపుర్ణంగా అర్థమవుతుంది.

'బీడీలు చుట్టిన/ చేతులతో అమ్మ/ మా భవిష్యత్తుకు/ శ్రీకారం చుట్టింది'

ఈ నానీ ఊరికే రాదు.

నాన్నొక గంధపు చెక్కంటు..

నాన్నా! పెద్ద బాడిశెతో / తుమ్మ మొద్దులు చెక్కి చెక్కి/ మొద్దుబారిన నీ చేతులు/ మాకింత ముద్ద పెట్టాలని ఎంతగా తపించేవి! / నాన్నా! నువ్వు కడదాకా / ఆ చెక్కల మధ్యనే బతుకు సాగించినా/ గంధపు చెక్కవై అరిగిపోయి/ మా భవిష్యత్తుకు /పరిమళాన్ని అద్దిన నిరుపమాన త్యాగానివి! నీ చేతిలో పునీతమైన/బాడిశె, ఉలి, రంపం, సుత్తె, శానం, పట్టకారూ ఒక్కటేమిటి / నీ తీపి గుర్తులుగా మిగిలిన/ సమస్త పని ముట్లన్నీ /నిన్ను గుర్తు చేసుకుంటూ/మాతో పాటుగా కన్నీటి చుక్కలు రాలుస్తూనే ఉన్నాయి!

అనడం కవి యొక్క అంతర్యం మనం అర్థం చేసుకొవచ్చు. కవి సత్యం గారు ఏ సాహిత్య పక్రియ రాసిన అందులో గొప్ప తాత్విక భావం దాగి ఉంటుంది. అమ్మ నాన్నల పై ఎవరికుండదు ప్రేమ ఈ కవికి ఇంకొంత ఎక్కువ. అందుకే ఇలా రాశాడేమో తల్లి తండ్రుల కష్టానికి ప్రతిఫలంగా ఆయన ఈ కవిత్వం రాసి ఔరా అనిపించాడు. నేటి సమాజంలో ఎన్నో అబద్దాల అడుగులను చుసి వాటిని చెరిపి నిజమైన విగ్రహాలు మనషుల మనసులో కట్టాలని శ్రమిస్తున్నాడీ కవి. అందుకే వెలివాడల లోని వెలుగును కొందరికైన పంచాలని అంబేద్కర్ గారి గురించిన కవితకు మనమందరం జవాబు కొరకు వెతుక్కోవాల్సిందే.

వెలివాడల వెలుగు రేఖవై/ చైతన్య క్రాంతిని నింపి/ బలహీన వర్గాలకు బలమై/ వెన్నంటి నిలిచావయ్యా!/నిన్ను చిన్న చూపు చూసి/ నీ ఆశయాల గోడల్ని/ కూల్చుతున్న వాళ్ళంతా నేడు/ నీ నామ స్మరణ చేస్తున్నారు ఓ సారి చూడవయ్యా!/

అంటు తన కలాన్ని కొంత మంది రాజకీయ నే'తల'లోకి సుటిగా దింపాడు కవి వెన్నెల సత్యం.

◆ **చిగురాల్ ప్రసాద్**
96421 09537

'మన సాహితి'కి వ్యాసాలు, లేఖలు
పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో
హామీపత్రం జతచేసి పంపగలరు.
e-mail: manamsahiti@gmail.com



ప్రపంచ బ్యాంకు రేసులో ఇవాంకా

- ఐరాస మాజీ రాయబారి నిక్కీహేలీ కూడా
- అమెరికన్ నామినీ ఎంపికకు కసరత్తు షురూ

వాషింగ్టన్, జనవరి 13: ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు జిమ్ యోంగ్ కిమ్ స్థానంలో కొత్తగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూతురు ఇవాంకా ట్రంప్, ఐక్యరాజ్యసమితిలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీ తదితరులు పోటీ పడుతున్నారు. తన పదవీకాలం ముగిసేందుకు దాదాపు మూడేళ్లు ఉన్నా.. తాను వైదొలగుతానని కిమ్ ఉన్నట్టుండి ప్రకటించిన విషయం తెలిసిందే. దాంతో ఈ పదవికి ఇవాంకా, నిక్కీలతో పాటు ఇంకా అంతర్జాతీయ వ్యవహారాల ట్రెజరీ అండర్ సెక్రటరీ డేవిస్ మాల్‌పాస్, అమెరికా అంతర్జాతీయ పరిణామాల సంస్థ అధినేత మార్క్‌గ్రీన్ తదితరులు కూడా పోటీలో ఉన్నారు. అమెరికా నుంచి ఈ పదవికి పోటీ పడేవాళ్లెవరో నిర్ణయించడానికి ట్రెజరీ డిపార్టుమెంటు కసరత్తులు ప్రారంభించింది. అభ్యర్థుల సామర్థ్యాల గురించి తాము ఏమీ మాట్లాడబోమని ఆ శాఖ ప్రతినిధి అన్నారు. నామినీ కోసం తాము అంతర్గత సమీక్ష మొదలుపెట్టామని, గవర్నర్లు కొత్త నాయకుడిని ఎన్నుకోడానికి చూస్తున్నామని చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచబ్యాంకు ఏర్పడినప్పటి నుంచి అందులో అతిపెద్ద భాగస్వామి అయిన అమెరికాయే దానికి అధ్యక్షులుగా ఎవరుండాలన్నది ఎన్నుకోవడం సంప్రదాయంగా వస్తోంది. అయితే, అమెరికా అభ్యర్థుల విజయం పూర్తిగా ఖాయం మాత్రం కాదు. ఎన్నిక ద్వారానే తుది నిర్ణయం ఉంటుంది.

పాకిస్థాన్‌కు కీలకహోదా ఔట్!

- ప్రధాన నాటోయేతర మిత్రదేశం
- ఆ హోదాను తొలగించాలని బిల్లు
- కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన రిపబ్లికన్

వాషింగ్టన్, జనవరి 13: పాకిస్థాన్‌ను అమెరికాకు ప్రధాన నాటోయేతర మిత్రదేశంగా ఉన్న హోదాను తొలగించాలని అక్కడి కాంగ్రెస్‌లో ఓ బిల్లు ప్రవేశపెట్టారు. పెట్టింది కూడా ఆషామాషీ వ్యక్తి కాదు.. ప్రభావవంతమైన రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు ఆండీ బ్రిగ్స్. ఆయన దీన్ని ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఆ హోదాను తొలగించడంతో పాటు ఒకవేళ మళ్లీ ఇవ్వాలంటే అందుకు కొన్ని నిబంధనలు పెట్టాలని తెలిపారు. ఈ తీర్మానాన్ని విదేశీ వ్యవహారాల సభాసంఘానికి పంపి, తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఒకవేళ పాకిస్థాన్‌కు మళ్లీ ఆ హోదా ఇవ్వాలంటే, పాకిస్థాన్ తమ దేశంలో హక్కానీ నెట్‌వర్క్ ఉగ్రవాదులు సురక్షితంగా, స్వేచ్ఛగా తిరగడానికి వీల్లేకుండా సైనిక చర్యలు చేపడుతోందన్న విషయాన్ని అమెరికా అధ్యక్షుడు నిర్ధరించాల్సి ఉంటుంది. అలాగే, హక్కానీ నెట్‌వర్క్ పాకిస్థాన్‌లోని భూభాగాన్ని సురక్షిత ప్రదేశంగా ఉపయోగించుకోడాన్ని తాము నిరోధిస్తున్నామని పాక్ నిరూపించుకోవాల్సి ఉంటుంది.

కూటమి మొత్తాన్ని తుడిచిపెట్టేస్తాం

- అది ఓ గూండాల గుంపు
- ఎస్పీ-బీఎస్పీపై యోగి వ్యాఖ్య



లఖ్‌నవూ, జనవరి 13: ఎస్పీ-బీఎస్పీ కూటమి కట్టడం వల్ల చివరకు భారతీయ జనతాపార్టీకే మేలు జరుగుతుందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ఆ కూటమి మొత్తం గూండాల గుంపులా ఉందని, తాము వాళ్లను తుడిచిపెట్టేస్తామని వ్యాఖ్యానించారు. వాళ్లిద్దరూ చేతులు కలపడమే మంచిదయ్యిందని, ఇప్పుడు వాళ్లను ఓడించడం తమకు మరింత సులభమవుతుందని ఆయన అన్నారు. ఇపుడు కావాలంటే ఒక పార్టీలో మరోదాన్ని కలిపేసుకోవచ్చని, కలిసి వెళ్లాలనుకున్నప్పుడు ఎందుకు కలుపుకోకూడదని ప్రశ్నించారు. ఆ రెండు పార్టీల పాలనలో రాష్ట్రంలో ఎంత అరాచకం రాజ్యమేలిందో ప్రజలకు తెలుసు కాబట్టి తమకు ఆ పార్టీల గురించి భయం లేదన్నారు. రెండు పార్టీలకూ రాష్ట్రంలో మెజారిటీ ప్రభుత్వాలు నడిపించే అవకాశం వచ్చిందని.. వాళ్ల దుష్పరిపాలన గురించి అందరికీ తెలుసని యోగి ఆదిత్యనాథ్ చెప్పారు. వాళ్ల పాలనలో మతఘర్షణలు, కులవిద్వేషాలు రాజ్యమేలాయని విమర్శించారు. ఇప్పుడు తన తండ్రి ములాయం సింగ్ యాదవ్‌కు ప్రధాని అభ్యర్థిగా మద్దతిస్తారో, లేదా మాయావతివైపు మొగ్గుతారో అఖిలేశ్ యాదవ్ తేల్చుకోవాలని చెప్పారు. అఖిలేశ్ చేస్తున్న రాజకీయాలు చూస్తే, తన తండ్రి ములాయంకు తన పార్టీ నుంచి టికెట్ ఇస్తారో లేదో కూడా అనుమానమేనన్నారు. నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలోను, దేశంలోను జరిగిన అభివృద్ధిని ప్రజలు చూస్తున్నారని, ఇవి బీజేపీ యూపీలో అధికారంలోకి వచ్చాక మరింత ఊపందుకున్నాయని అన్నారు.

వారిది 'సామ్రాజ్య'కాంక్ష

మాది సాధికారత ఆకాంక్ష.. మహాకూటమి అవకాశవాద కూటమి.. విపక్షాలపై ప్రధాని మోదీ ధ్వజం



న్యూఢిల్లీ, జనవరి 13: దేశంలోని పలు పార్టీలు తమకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్న మహాకూటమిని 'అవకాశవాద కూటమి' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులోని భారతీయ జనతా పార్టీ కార్యకర్తలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ... 'వారు తమ సొంత సామ్రాజ్య నిర్మాణం కోసం పనిచేస్తున్నారు. కానీ, మేము ప్రజల సాధికారత కోసం పనిచేస్తున్నాము. ప్రతి పక్షాలది తమ అవసరాల కోసం ఏర్పాటు చేసుకుంటున్న స్వల్ప కాలిక కూటమి. ఇతర పార్టీల్లా మేము ఓటు బ్యాంకు కోసం.. విభజించు, పాలించు అనే విధానాన్ని పాటించట్లేదు. అన్ని రంగాల్లోనూ దేశానికి సేవ చేయాలనే ఉద్దేశంతో పని చేస్తున్నాము. మన అభివ ద్ధి అజెండాను మరింత ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలు బీజేపీకి, దేశానికి చాలా ముఖ్యమైనవి' అని వ్యాఖ్యానించారు. 'ఓ వైపు అభివృద్ధి అజెండాతో పని చేస్తున్న బీజేపీ ఉంది. మరోవైపు అవకాశవాద కూటమి, రాజవంశ పార్టీలు ఉన్నాయి. నేను, ప్రభుత్వం సమర్థంగా పనిచేయట్లేదని కొందరు ఆరోపిస్తున్నారు. మరి మమ్మల్ని ఓడించేందుకు కూటమిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏముంది? ప్రభుత్వం సమర్థంగా పని చేస్తుందని వారికి తెలుసు. వారిపై వారికి నమ్మకం లేదు. ప్రభుత్వం సరిగ్గా పని చేయట్లేదని అసత్య ప్రచారం చేయడానికి వారు ఏ అవకాశాన్నీ వదులు కోవట్లేదు. యువత, రైతులు, మహిళలతో పాటు సమాజంలోని ప్రతి వర్గానికి ఎన్డీఏ ప్రభుత్వంపై నమ్మకం ఉంది. మొదటి సారి ఓటు వేసేవారు సహజంగానే భాజపాకి మద్దతు తెలుపుతారు. వారికి రాజవంశాల రాజకీయాలపై కాకుండా అభివృద్ధిపైనే ఆసక్తి ఉంటుంది. హామీలు ఇచ్చే వారికి కాకుండా పనిచేసే వారికి మద్దతు తెలుపుతారు' అని మోదీ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి చెప్పాలని మోదీ కార్యకర్తలకు సూచించారు. 'కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే డబ్బు పడుతోంది. మధ్యలో ఎటువంటి అవకతవకలు జరిగే అవకాశం లేదు. వస్త్ర పరిశ్రమ రంగంలో తమిళనాడు ప్రసిద్ధి చెందింది. మేము ఆ పరిశ్రమ అభివృద్ధి చెందడానికి చర్యలు తీసుకున్నాం. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు మేము ప్రాధాన్యతనిస్తున్నాం. రానున్న ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుంది. అది నా వల్లో, ఇతర ఏ నాయకుడి వల్లో కాదు. భాజపా కార్యకర్తల వల్ల సత్తా చాటనుంది. దేశ ప్రయోజనాల కోసమే మన కార్యకర్తలు పనిచేస్తారు. వారికి సొంత ప్రయోజనాల కన్నా దేశ ప్రయోజనాలే ముఖ్యం' అని అన్నారు.

1947నాటి పొరపాటును సరిదిద్దాం..

న్యాయం పక్షంలో ఉండాలని సిక్కుల గురువులు మనందరికీ బోధించారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. సిక్కుల ఆధ్యాత్మిక గురువు గురు గోబింద్ సింగ్ జయంత్యుత్సవాల సందర్భంగా ఆయన ఆదివారం ఓ స్మారక నాణేన్ని విడుదల చేశారు. మోదీ అధికారిక నివాసంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తోపాటు సిక్కుల ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు చురకలు వేశారు. న్యాయం పక్షంలో ఉండాలని సిక్కుల గురువులు మనకు చెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వం వారి బాటలోనే నడుస్తూ, 1984 సిక్కుల ఊచకోత బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాకిస్థాన్‌లోని కర్తార్‌పూర్ సాహిబ్‌లోని గురు నానక్ దేవ్‌ను ఇకపై టెలిస్కోపు (దుర్భిణి) ద్వారా దర్శించుకోవలసిన అవసరం ఉండదని చెప్పారు. 1947నాటి పొరపాటును సరిదిద్దామని చెప్పారు. కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్తార్‌పూర్ గురుద్వారా దర్బార్ సాహిబ్‌ను అప్పట్లో నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అందుకు ప్రాయశ్చిత్తంగానే తాము ఇప్పుడు (పాకిస్థాన్‌లోని) కర్తార్‌పూర్ వెళ్ళేందుకు రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాకిస్థాన్‌లోని కర్తార్‌పూర్ గురుద్వారాలో సిక్కుల గురువు గురు నానక్ 18 సంవత్సరాలపాటు ఉన్నారు. గురు నానక్ 550వ జయంత్యుత్సవాలకు సిక్కులు ఈ గురుద్వారాను సందర్శించేందుకు ఈ సంవత్సరం అవకాశం కలిగింది. భారతదేశంలోని పంజాబ్ నుంచి పాకిస్థాన్ సరిహద్దుల వరకు భారత ప్రభుత్వం రోడ్డును నిర్మిస్తోంది. అదేవిధంగా పాకిస్థాన్ కూడా సరిహద్దుల వరకు రోడ్డును నిర్మిస్తోంది. భారత్ సరిహద్దుల నుంచి కర్తార్‌పూర్ 4 కి.మీ. దూరంలో ఉంది. 1947లో కాంగ్రెస్ ప్రభుత్వం కర్తార్‌పూర్ విషయంలో సరైన నిర్ణయం తీసుకోలేకపోయిందని మోదీ పరోక్షంగా దుయ్యబట్టారు.



ఎవరున్నా అలాగే అంటా

- నిర్మలపై వ్యాఖ్యలకు రాహుల్ సమర్థన
- శబరిమలలోకి ప్రవేశం మహిళల విజ్ఞతకే..
- ఈ విషయంలో నా వైఖరి మారింది: రాహుల్



దుబాయ్, జనవరి 13: రఫేల్ ఒప్పందంపై విమర్శలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సమర్థించుకున్నారు. సీతారామన్ స్థానంలో ఎవరున్నా ఇలాంటి వ్యాఖ్యలే చేసేవాడినని స్పష్టం చేశారు. దుబాయ్‌లో జరిగిన మీడియా సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీతారామన్‌కు బదులుగా రఫేల్ ఒప్పంద పత్రాలను ప్రధాని పార్లమెంటులో సమర్పించాలన్నారు. 'ప్రధాని ఈ ఒప్పందం ద్వారా రూ.30వేల కోట్లు దోచుకొనేలా అనిల్ అంబానీకి సహకరించారు. పార్లమెంటులో ఇతరులతో మాట్లాడించకుండా ప్రధాని రఫేల్ అంశంపై మాట్లాడాలి. సీతారామన్ స్థానంలో మరో వ్యక్తి ఉన్నా నేను ఇలాంటి వ్యాఖ్యలే చేసేవాడిని. అసలు విషయాన్ని పక్కదోవ పట్టిస్తున్నారు. ఆ ఒప్పందంపై మాట్లాడటానికి ప్రధానికి ధైర్యంలేదు' అని తీవ్రంగా మండిపడ్డారు. రాజస్థాన్‌లో ర్యాలీ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ..56 అంగుళాల ఛాతీ ఉన్న వ్యక్తి ఓ మహిళ వద్దకు వెళ్లి తనను రక్షించమని కోరారని ప్రధానిని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. ఆ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. 'మొదటి సారి భారత పుత్రిక రక్షణ మంత్రి హోదాలో పనిచేస్తున్నారు. ఆమె పార్లమెంటులో రఫేల్ ఒప్పందం మీద ప్రతిపక్షాల నోర్లు మూయించారు. కానీ వారు మాత్రం మహిళా శక్తిని అవమానించారు' అని ఆగ్రా పర్యటన సందర్భంగా ప్రధాని మండిపడిన సంగతి తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై రాహుల్‌కు జాతీయ మహిళా కమిషన్ నోటీసులు కూడా జారీ చేసింది.

వారి విజ్ఞతకే వదిలేస్తున్నా..

శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తన ధోరణి మార్చుకున్నారు. గతంలో యువతుల ప్రవేశాన్ని సమర్థించిన రాహుల్, సంప్రదాయ నిషేధాన్ని కొనసాగించేలా ప్రజల వద్ద ఆమోదించదగ్గ కారణాలే ఉన్నాయని తాజాగా అన్నారు. దుబాయ్ పర్యటనలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ మేరకు స్పందించారు. ''శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళల ప్రవేశం విషయంలో ఇరు వర్గాల వాదనలు నేను పరిశీలించాను. వారు ఆలయంలోకి ప్రవేశించాలా వద్దా అనేది నేను చెప్పను. ఈ విషయాన్ని నేను ప్రజలకే వదిలేస్తున్నాను.'' అని రాహుల్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు అన్ని వయసుల మహిళలను ఆలయంలోకి అనుమతించాలని తొలుత రాహుల్ కేరళ ప్రభుత్వానికి మద్దతిచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న భాజపా సహా.. ఇతర హిందుత్వ సంస్థల వాదనలను ఖండించారు. అయితే, శబరిమల అంశంలో రాహుల్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఎన్నికల వ్యూహంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ''సంప్రదాయాన్ని పరిరక్షించాలనే వాదనకు విలువ ఉందని భావిస్తున్నాను. అదేవిధంగా మహిళలకు సమాన హక్కులు ఉండాలన్న వాదనకు కూడా విలువ ఉంది'' అని చెప్పారు. కేరళ కాంగ్రెస్ నేతలతో మాట్లాడిన తర్వాత తాను తన వైఖరిని మార్చుకున్నట్లు తెలిపారు. శబరిమల అయ్యప్ప దేవాలయంలో మహిళల ప్రవేశంపై అనుసరించవలసిన వైఖరిపై నిర్ణయం తీసుకునే బాధ్యతను కేరళ కాంగ్రెస్ నేతలకే అప్పగించినట్లు చెప్పారు.

యూపీలో 15 ర్యాలీలు

- రాహుల్ కోసం కాంగ్రెస్ రూట్‌మ్యాప్
- ఎన్నికల్లో ఒంటరిపోరుకు దాదాపు సిద్ధం
- అప్నాదళ్, శివపాల్‌వైపూ కాంగ్రెస్ చూపు

న్యూఢిల్లీ, జనవరి 13: ఎస్పీ-బీఎస్పీ కూటమి తమను దూరం పెట్టడంతో యూపీలో ఒంటరి పోరుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. రాష్ట్రంలో 2019 సార్వత్రిక ఎన్నికలకు లౌకిక శక్తులను కలుపుకొనే ప్రయత్నం చేస్తోంది. ఈసారి శివపాల్ యాదవ్‌తో కాంగ్రెస్ పొత్తు ఉండొచ్చని అంటున్నారు. అయితే ఆయన తమకు 15 స్థానాలు ఇవ్వాలని కోరడమే అతిపెద్ద సమస్యగా ఉంది. అప్నాదళ్, అజిత్ సింగ్‌కు చెందిన ఆర్ఎల్‌డీ పార్టీలతోనూ కాంగ్రెస్ అధిష్ఠానం సంప్రదింపుల్లో ఉంది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ యూపీలో 15 ర్యాలీలలో పాల్గొంటారు. ఫిబ్రవరి నుంచి మొదలుపెట్టే ఈ ర్యాలీలలో ప్రధానంగా రైతు సమస్యల గురించే ప్రస్తావిస్తారు. వ్యవసాయ సంక్షోభం, రైతుల అసంతృప్తి లాంటివాటిని ప్రస్తావిస్తూ కేంద్రంలోని బీజేపీ సర్కారుతీరును రాహుల్ ఎండగడతారని అంటున్నారు. ముందుగా పశ్చిమ ఉత్తరప్రదేశ్ లోని హాపూర్ జిల్లా నుంచి మొదలుపెట్టి తర్వాత మొరాదాబాద్, సహారన్‌పూర్, బరేలిలలో ర్యాలీలు సాగుతాయి. ఎస్పీ - బీఎస్పీ కూటమిని ప్రకటించిన తర్వాత.. ఆ రెండు పార్టీలు ఒక రాజకీయ నిర్ణయం తీసుకున్నాయని, తాము రాష్ట్రంలో పూర్తి సామర్థ్యంతో పోరాడుతామని రాహుల్ గాంధీ అన్నారు. ఆ విషయం చెప్పే సమయానికి ఆయన దుబాయ్‌లో ఉన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు గులాం నబీ ఆజాద్, పీసీసీ అధ్యక్షుడు రాజ్‌బబ్బర్, ఇతర సీనియ్ నాయకులు వరుసగా రెండు రోజుల పాటు ఢిల్లీలో సమావేశమై రాహుల్ యూపీ పర్యటన రోడ్‌మ్యాప్ సిద్ధం చేశారు.



మా కూటమిలోకి బీజేపీ కార్యకర్తలు

- యూపీ మాజీ సీఎం అఖిలేశ్ వ్యాఖ్య

లఖ్‌నవూ, జనవరి 13: ఎస్పీ-బీఎస్పీ పొత్తుతో బీజేపీ ఆశలన్నీ గల్లంతయ్యాయని, ఆ పార్టీ కార్యకర్తలు కూడా తమ తమ పార్టీలలో చేరాలనుకుంటున్నారని యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ అన్నారు. పొత్తు కుదిరిన తర్వాత మంచి ఉత్సాహంలో ఉన్న ఆయన.. దీని గురించి ట్వీట్ చేశారు. మోదీ చెబుతున్న 'మేరా బూత్.. సబ్‌సే మజ్‌బూత్'ను ఎద్దేవా చేస్తూ, బీజేపీ కార్యకర్తలు 'మేరా బూత్.. హువా చుక్నాచూర్' అంటున్నారన్నారు. ఇప్పుడు వాళ్లు కూడా తమ కూటమిలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నట్లు చెప్పారు.

కశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్, జనవరి 13: జమ్ము కశ్మీర్‌లో భద్రతా దళాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. వాళ్లలో ఎ++ కేటగిరీ ఉగ్రవాది అయిన జీనత్-ఉల్-ఇస్లాం కూడా ఉన్నాడు. అతడు అల్-బదర్ అనే ఉగ్రవాద సంస్థను బలోపేతం చేసేందుకు హిజ్బుల్ ముజాహిదీన్ నుంచి గత సంవత్సరం రెండు సంస్థల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా అల్-బదర్‌కు వచ్చాడు. ఐఈడీలు తయారుచేయడంలో అతడు నిపుణుడని భద్రతా దళాలు పేర్కొన్నాయి. కట్పోరా ఎన్‌కౌంటర్‌లో జరిగిన ఇద్దరు ఉగ్రవాదులను జీనత్-ఉల్-ఇస్లాం, షకీల్ దార్‌గా గుర్తించామన్నారు. వీరిద్దరూ పలు ఉగ్రవాద నేరాల్లో పాల్గొన్నట్లు చెప్పారు. కట్పోరా ప్రాంతంలో భద్రతా దళాలు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా.. ఉగ్రవాదులు వాళ్లపై కాల్పులు జరిపారు. వారిని లొంగిపోవాలని చెప్పినా కాల్పులు కొనసాగించడంతో భద్రతాదళాలు జరిపిన ఎదురు కాల్పులలో ఇద్దరూ మరణించారు. వారి నుంచి భారీ మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

దృశ్యం' చూసి.. మహిళ హత్య

- కుక్కను కప్పెట్టి పోలీసులకు ఝలక్
- శాస్త్రీయపద్ధతిలో కనిపెట్టిన పోలీసులు
- బీజేపీ నాయకుడు.. కుమారుల అరెస్టు

ఇండోర్, జనవరి 13: తెలుగులో వచ్చిన దృశ్యం సినిమాకు హిందీ రీమేక్ చూసి.. అచ్చం అదే పద్ధతిలో 22 ఏళ్ల మహిళను రెండేళ్ల క్రితం చంపిన కేసులో ఒక బీజేపీ నాయకుడు, అతడి ముగ్గురు కొడుకులు సహా మొత్తం ఐదుగురిని మధ్యప్రదేశ్ పోలీసులు అరెస్టుచేశారు. బీజేపీ నాయకుడు జగదీష్ కరోటియా అలియాస్ కల్లూ పహిల్వాన్ (65), అతడి కొడుకులు అజయ్ (36), విజయ్ (38), వినయ్ (31), వాళ్ల అనుచరుడు నీలేష్ కశ్యప్ (28)లను వనగంగ ప్రాంతానికి చెందిన ట్వింకిల్ డాగ్రే (22) అనే మహిళ హత్యకేసులో అరెస్టుచేసినటలు డీఐజీ హరినారాయణ్ చారి మిశ్రా తెలిపారు. జగదీష్ కోటియాతో ట్వింకిల్‌కు వివాహేతర సంబంధం ఉండేది. ఆమె కూడా ఆ కుటుంబంలోనే కలిసి ఉంటానని చెప్పడంతో కరోటియా కుటుంబంలో వివాదం చెలరేగింది. దాంతో ట్వింకిల్‌ను చంపాలని వాళ్లు నిర్ణయించుకున్నారు. 2016 అక్టోబరు 16న ఆమెను పీకినొక్కి చంపి, తర్వాత మృతదేహాన్ని కాల్చేశారు. ఆమెను కాల్చినచోటు నుంచి ఒక బ్రేస్‌లెట్, ఇతర నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హత్యకు ముందు దృశ్యం సినిమా చూశారి, దాంతో వాళ్లు ఒకచోట ఒక కుక్కను పాతిపెట్టారని డీఐజీ తెలిపారు. తర్వాత ఒక మనిషి శవాన్ని పాతిపెట్టినట్లు వాళ్లే వదంతులు వ్యాపింపజేశారన్నారు. పోలీసులు ఆ గొయ్యి తవ్వి చూస్తే కుక్క శవం కనిపించడంతో దర్యాప్తు పక్కదారి పట్టింది. తర్వాత శాస్త్రీయ పద్ధతులు ఉపయోగించి, కటోరియాకు.. అతడి ఇద్దరు కొడుకులకు గుజరాత్‌లోని ఒక ల్యాబ్‌లో బ్రెయిన్ ఎలక్ట్రికల్ ఆసిలేషన్ సిగ్నేచర్ (బెయోస్) పరీక్ష నిర్వహించారు. ఇది ఇంటరాగేషన్‌లో ఉపయోగపడే ఒక ప్రమాదరహిత, న్యూరో సైకలాజిలక్ టెక్నిక్. దీన్ని బ్రెయిన్ ఫింగర్‌ప్రింటింగ్ అని కూడా అంటారు. ఈలోపు మృతురాలి కుటుంబ సభ్యులు కటోరియాకు బీజేపీ మాజీ ఎమ్మెల్యే అండదండలు ఉండటంతో పోలీసులు కూడా ఏమీ చేయడం లేదని ఆరోపించారు. అయితే, మాజీ ఎమ్మెల్యే పాత్రకు సాక్ష్యాలేమీ లేవని డీఐజీ అన్నారు.



మనం మూవీ
manammovie
సోమవారం 14 జనవరి 2019 హైదరాబాద్ 6



శ్రీరాం 'అసలేం జరిగింది?'

ఎక్సోడస్ మీడియా నిర్మిస్తున్న అసలేం జరిగింది? చిత్రం పోస్టర్‌ను ఎంపీ సంతోష్ కుమార్ శనివారం జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీమతి నీలిమా ప్రొడ్యూసర్‌గా శ్రీరాం హీరోగా రూపొందుతున్న ఈ చిత్రం విజయవంతం కావా లని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంతవరకూ ఎవరూ తీయని కొత్త ప్రాంతాల్లో షూటింగ్ జరపాలనుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకోసం చిత్ర యూనిట్ ఆరు నెలల పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాలను సందర్శించడం గొప్ప విషయమన్నారు. ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్న కెమెరామన్ ఎన్వీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాం హీరోగా రూపొందుతున్న ఈ చిత్రానికి మ్యూజిక్‌ను మహావీర్ అందిస్తున్నారు. రామగోపాల్ వర్మ నిర్మించిన భైరవగీత విలన్ విజయ్ రామ్ ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథ నెర్రపల్లి వాసు అందించారు. ఫిబ్రవరి 11 నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభం అవుతుందని... రెండు షెడ్యూళ్లలో చిత్రీకరణ పూర్తి చేస్తామని నిర్మాత కె.నీలిమా తెలిపారు.



అఖిల్ అక్కినేని

జనవరి 14న 'మిస్టర్ మజ్ను' పాటలు

అఖిల్ అక్కినేని హీరోగా శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్పి పతాకంపై 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకొని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి జనవరి 25న చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన పాటలకు, టీజర్‌కు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. 'ఏమైనదో... ఏమైనదో', మిస్టర్ మజ్ను టైటిల్ సాంగ్, 'హార్ట్ బ్రేక్' పాటలకు మంచి ఆదరణ లభిస్తోంది. జనవరి 14 ఉదయం 10 గంటలకు సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం జ్యూక్ బాక్స్‌ను విడుదల చేయబోతున్నారు.



\- అనిల్ రావిపూడి

ఈ సినిమాతో ఆ కోరిక తీరింది

వెంకటేష్, వరుణ్‌తేజ్, తమన్నా, మెహరీన్ కౌర్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఎఫ్ 2... ఫన్ అండ్ ఫ్రస్టేషన్'. అనిల్ రావిపూడి దర్శకుడు. దిల్ రాజు సమర్పణలో శిరీష్, లక్ష్మణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. సినిమా విడుదల సందర్భంగా దర్శకుడు అనీల్ రావిపూడి మాట్లాడుతూ...

ఆసనం ఐడియా అలా వచ్చిందే..

\- సాధారణంగా మనం రకరకాల ఆసనాలు వేస్తుంటాం. అలాంటిది మనలో ఉన్న ఒత్తిడిని దూరం చేసుకోవడానికి ఒక ఆసనం ఉంటే ఎలా ఉంటుంది. అనే ఆలోచన నుండి ఈ వెంకీ ఆసనం పుట్టుకొచ్చింది. అలాగే వెంకటేష్‌గారికి ఓ మెనరిజమ్ పెట్టి.. దాన్ని కథకు లింక్ చేస్తు బావుంటుందనిపించి ఈ వెంకీ ఆసనం కనిపెట్టాను. ఆడియెన్స్ దాన్ని బాగా ఓన్ చేసుకున్నారు. చాలా మంది థియేటర్‌లో ఆ ఆసనాన్ని వేస్తున్నారు. పాపులర్ అయ్యింది.

వారి స్థాయికి ఇంకా చేరుకోలేదు..

\- సంక్రాంతి విన్నర్ అంటే పక్క సినిమాలతో పోటీ అనే భావన వచ్చేస్తుంది. అయితే నాకొక ఆలోచన ఉండేది. ఈవీవీగారి సినిమాలు, కృష్ణారెడ్డిగారి సినిమాలు.. జంధ్యాలగారి సినిమాలను చూస్తే.. అన్నీ వర్గాల ప్రేక్షకులు నవ్వుతూనే ఉండేవారు. వారి సినిమాలను బాగా చూసేవాడిని. అలా పూర్తిస్థాయి సినిమాను తీయాలనే కోరిక ఉండేది. అది ఈ సినిమాతో తీరింది. మెమొరబుల్ ఎక్స్‌పీరియెన్స్. అందరూ పగలబడి నవ్వుతున్నారు. సోషల్ మీడియాలో ఈవివిగారు, జంధ్యాలగారితో పోలుస్తూ కొందరు కామెంట్స్ కూడా చేశారు. అయితే వారి స్థాయికి నేను ఇంకా చేరుకోలేదు. అయితే ఎక్కడో ఒకచోట వాళ్ల ప్రభావం నాపై ఉంటుందనే మా మాత్రం వాస్తవం. ఎందుకంటే వాళ్ల సినిమాలను నేను అలా చూసేవాడిని. వారి స్టయిల్‌ను నా స్టయిల్‌కు తగ్గట్టు మార్చుకుని సినిమాలు చేస్తున్నాను.

వరుణ్ చేస్తాడా ! అని ఆలోచించా...

వరుణ్ కూడా ఇప్పటి వరకు కామెడీ జోనర్‌లో సినిమా చేయలేదు. తను వెంకటేష్‌తో ఎలా కామెడీ టైమింగ్‌లో చేస్తాడోనని కాస్త ఆలోచించాను. తెలంగాణ యాస మాట్లాడుతూ వరుణ్ యాదవ్ అనే కుర్రాడి పాత్రలో కామెడీ జోనర్‌లో తొలిసారి చాలా చక్కగా నటించాడు. వెంకీగారితో కలిసి తను అద్భుతంగా నటించాడు.

కథాలోచన అక్కడ నుండే వచ్చింది...

\- 'పటాస్ నుండి రాజాది గ్రేట్' వరకు కమర్షియల్ సినిమాలు చేశాను. అయితే 'రాజాది గ్రేట్' సినిమా చేసేటప్పుడు అసలు ఫైట్ లేకుండా ఓ కమర్షియల్ సినిమా చేద్దాం అనే ఆలోచన వచ్చింది. దానికి ఎలాంటి బేస్ తీసుకుద్దాం. అని ఆలోచన వచ్చింది. 'పెళ్ళాం చెబితే వినాలి, క్షేమంగా వెళ్ళి లాభంగా రండి' జోనర్‌లో ఈ మధ్య సినిమాలు రాలేదనిపించి ఈ కథను రాసుకున్నాను. సాధారణంగా ఓ సినిమాను పూర్తి చేయడానికి ఏడాది సమయం పడుతుంది. కాబట్టి నాటీం సాయి, ప్రవీణ్, నారాయణలతో కథపై నాలుగైదు నెలలు వర్క్ చేశాం.

సీక్వెల్‌గా చేస్తా...

\- హిందీలో 'గోల్‌మాల్, హౌస్ ఫుల్ సినిమాల సిరీస్ ఉంది. మన తెలుగులో ఇలాంటి జోనర్‌లో సినిమాలు చేయాలని ఉంది. కచ్చితంగా 'ఎఫ్ 2'కు సీక్వెల్‌గా 'ఎఫ్ 3' చేస్తాను. వెంకటేష్‌గారికి, వరుణ్‌కి చెప్పేశాను. వాళ్లు ఎప్పుడైనా రెడీ అన్నారు.

చర్చల్లో ఉంది...

\- వెంకటేష్‌గారికి ఓ లైన్ చెప్పాను. ఆయనకు బాగా నచ్చింది. కథా చర్చలు జరుగుతున్నాయి. అది ఎప్పుడు ఓకే అవుతుందో ఇప్పుడే చెప్పలేను.

- ఆయన కథను నమ్మారు..

వెంకటేష్‌గారు కథను బాగా నమ్మారు. డబ్బింగ్ చెప్పేటప్పుడు సినిమా అంతా చూసి.. బయటకు వచ్చి 'అదేంటమ్మా అలా చేయించేశావ్' డబ్బింగ్ ఎంత ఎనర్జీతో చెప్పాలో తెలుసా! రేపు వచ్చి డబ్బింగ్ చెబుతాను' అని వెళ్లిపోయారు. చాలా కేర్ తీసుకుని డబ్బింగ్ చెప్పారు.

అక్కడే నుండే ఆ క్యారెక్టర్స్...

\- సూర్యకాంతంగారి నటనలో, డైలాగ్ చెప్పడంలో ఓ స్టయిల్ ఉంటుంది. ఆమె డైలాగ్‌ను చాలా అందంగా విరుస్తారు. అలాంటి క్యారెక్టర్ మోడ్రన్‌గా ఉంటే ఎలా ఉంటుందో అని ఆలోచించి ప్రగతి క్యారెక్టర్‌ను పెట్టాం. మా అమ్మమ్మ, నాయనమ్మలు ఉండేవారు. ఏ ఫంక్షన్‌కి వచ్చినా మంచంపై కూర్చుని అది.. ఇది అంటూ అందరినీ కామెంట్ చేస్తుంటారు. ఆ క్యారెక్టర్స్ నాకు బాగా రిజిష్టర్ అయ్యాయి. అందువల్ల అలాంటి క్యారెక్టర్స్‌ను అన్నపూర్ణమ్మ, వై.విజయలుగా సినిమాలో చూపెట్టాం.

తదుపరి చిత్రాలు...

\- ఇంకా ఏమీ అనుకోలేదు. పండుగకు ఊరెళ్లి ఎంజాయ్ చేసి.. మూడు వారాలు రిలాక్స్ అయ్యి.. ఓ జోనర్‌లో చేయాలనేది ఆలోచించుకుని చేస్తాను. బాలకృష్ణగారికి కూడా ఓ ఐడియా చెప్పాను. ఈసారి ఫుల్ లెంగ్త్ కామెడీ చేయను. అయితే నా సినిమాల్లో ఫన్ లేయర్ లేకుండా ఉండదు.



కార్తి

రకుల్ ప్రీత్ సింగ్

ప్రేమికుల రోజున 'దేవ్'

కార్తి హీరోగా నటిస్తున్న 'దేవ్' సినిమా విడుదల తేదీ ఖరారైంది. వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న విడుదల కానుంది. హరీష్ జయరాజ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలకు అద్భుతమైన స్పందన వస్తోంది. దేవ్ ఫస్ట్ లుక్‌కు ప్రేక్షకుల నుంచి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ యాక్షన్ ఫ్యామిలీ డ్రామాను రజత్ రవిశంకర్ తెరకెక్కిస్తున్నారు. ఖాకీ లాంటి సూపర్ హిట్ సినిమా తర్వాత కార్తి సరసన రెండోసారి రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రకాశ్ రాజ్, రమ్యకృష్ణ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిక్కీ గిర్లానీ దేవ్ చిత్రంలో రెండో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆర్ వేల్‌రాజ్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. రిలయన్స్ ఎంటర్ టైన్మెంట్ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్నారు.



పూజా హెగ్డే

మొబైల్ బ్రాండ్ అంబాసిడర్‌గా..

హీరోయిన్‌గా క్రేజీ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్న పూజా హెగ్డే ఇప్పుడు మొబైల్‌కి బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేయనుందట. ఇంతకు మొబైల్ ఏదో తెలుసా! లావ్ మొబైల్స్. ఇందుకు సంబంధించిన యాడ్ లింక్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ప్రస్తుతం టాప్‌స్టార్స్‌తో నటిస్తున్న హీరోయిన్ పూజా హెగ్డే.. ప్రస్తుతం మహేష్ మహర్షి ఈ ఏడాది విడుదలవుతోంది. కాగా జిల్ ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రభాస్ 20వ సినిమా 'జాన్'(వినపడుతోన్న పేరు)లో ప్రభాస్ సరసన నటించనుంది. గత ఏడాది ఎన్టీఆర్‌తో పూజా హెగ్డే నటించిన 'అరవింద సమేత' పెద్ద విజయాన్ని సొంతం చేసుకుంది.

ఫిబ్రవరి మొదటి వారంలో 'యమ్6'

విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్స్‌పై విశ్వనాథ్ తన్నీరు నిర్మించిన చిత్రం 'యమ్6'. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. ఈ సందర్భంగా నిర్మాత విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ ''మా 'యమ్6' చిత్రం సెన్సార్ పూర్తి చేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా చాలా క్వాలిటీగా నిర్మించాం. ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే ఒక అద్భుతమైన కథని దర్శకుడు జైరాం అంతే అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా ప్రతి ఒక్కరినీ అలరిస్తుంది. ఫిబ్రవరి మొదటి వారంలో ఈ సినిమాను విడుదల చేస్తున్నాం'' అన్నారు. దర్శకుడు జైరామ్‌వర్మ మాట్లాడుతూ ''నిర్మాత విశ్వనాథ్‌గారు ఈ సినిమాను క్వాలిటీలో ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. ఎలాంటి హంగులు ఆర్భాటాలు లేకుండా సినిమాను నేచురల్‌గా తెరకెక్కించాం. ప్రత్యేకంగా పోరాట దృశ్యాలు మన కళ్ళముందే జరుగుతున్నట్లు ఉంటూ అందరినీ అలరిస్తాయి. ఇలాంటి సినిమాలు తమిళ, మలయాళ, కన్నడలో వచ్చేవి. ఇప్పుడు తెలుగు ప్రజలు కూడా ఈ రకమైన సినిమాల్ని ఎంజాయ్ చేయటం ఆనందంగా ఉంది. ఈ సినిమాని ఒక రకమైన ప్రయోగంలా భావించి తెరకెక్కించాము. చూసిన ప్రతి ఒక్కరూ థ్రిల్‌గా ఫీల్ అవుతూనే లవ్, కామెడీని బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. హీరో ధ్రువ మాట్లాడుతూ ''ఒక మంచి చిత్రం ద్వారా పరిచయం అవుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. నా టాలెంట్‌ను గుర్తించి నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు'' అన్నారు.





'మహా చంద్ర' డబ్బింగ్ పూర్తి

నైనా ఫిలిమ్స్ పతాకంపై యశ్, ప్రేమ్ కుమార్, శ్రియ నటీనటులుగా రూప అయ్యర్ దర్శకత్వంలో షాన్వాజ్ నిర్మించిన చిత్రం 'మహా చంద్ర'. ఈ చిత్రం ప్రస్తుతం డబ్బింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత షాన్వాజ్ మాట్లాడుతూ ''కన్నడలో సూపర్ హిట్ అయిన చంద్ర చిత్రాన్ని 'మహా చంద్ర' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం. యశ్ ఈ చిత్రంలో ఒక ప్రముఖ పాత్రను పోషిస్తున్నారు. అలాగే శ్రియ తన అద్భుతమైన నటనతో ఆకట్టుకుంటుంది.ప్రస్తుతం డబ్బింగ్ పూర్తి చేసుకున్న మా చిత్రాన్ని ఫిబ్రవరి రెండో వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం'' అన్నారు.

'అదృశ్యం' ట్రైలర్ లాంచ్

వైష్ణవి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవిప్రకాష్ కృష్ణంశెట్టి నిర్మించిన చిత్రం 'అదృశ్యం'. ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. సినిమాను ఫిబ్రవరిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ చిత్ర ట్రైలర్‌ను శనివారం ఫిల్మ్‌ఛాంబర్‌లో హీరో జాన్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో మ్యూజిక్ డైరెక్టర్ ఆల్‌డ్రిన్ మాట్లాడుతూ ''తెలుగులో ఇది నా మొదటి చిత్రం. తమిళ్‌లో దాదాపుగా 7 చిత్రాలకు సంగీతాన్ని అందించాను. తెలుగులో కూడా బిజీ అవ్వాలని కోరుకుంటున్నాను'' అన్నారు. హీరో జాన్ మాట్లాడుతూ ''తెలుగులో ఇది నా మూడవ చిత్రం. అదే నువ్వు అదేనేను, బంటీ ద బ్యాడ్ బోయ్ తర్వాత నేను నటించే మూడవ చిత్రమిది. నాకు ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ రవిగారికి నా కృతజ్ఞతలు'' అన్నారు. దర్శకుడు రవిప్రకాష్ మాట్లాడుతూ ''కె.విశ్వనాథ్‌గారు. సింగీతం శ్రీనివాసరావుగారి దగ్గరకో డైరెక్టర్‌గా చాలా సినిమాలకు పని చేశాను. ఇది ఒక థ్రిలర్.చాలా అత్యద్భుతంగా ఉంటుంది. చిత్రంలో ఎక్కడా ల్యాగ్ ఉండదు. జయవాణి ఒక మాంత్రికురాలిగా ప్రత్యేక పాత్రలో చేశారు.అందరూ తప్పకుండా ఈ చిత్రాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నాను'' అన్నారు.





సిటీ బ్యాంకుకు భారీ జరిమానా



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సిటీ బ్యాంకు భారీ షాక్ ఇచ్చింది. అమెరికా ప్రధాన కేంద్రంగా సేవలు అందించే సిటీ బ్యాంకుకు భారతీయ రిజర్వు బ్యాంకు రూ.3 కోట్లు జరిమానా విధించింది. 'ఫిట్-అండ్-సబ్జెక్ట్ క్రైటీరియా'కు సంబంధించి సూచనలను పాటించలేదంటూ ఆర్‌బిఐ పెనాల్టీ విధించింది. ఆదేశాల మేరకు డైరెక్టర్ల నియామకంలో నిబంధనలు పాటించకపోవడమే ఇందుకు కారమని రిజర్వు బ్యాంకు ఓ ప్రకటనలో తెలిపింది.సమర్థులైన డైరెక్టర్లను నియమించాలని, సరైన అర్హతలుండాలని ఆర్బీఐ గతంతో బ్యాంకును ఆదేశించింది. ఈ ఆదేశాలను పాటించక పోవడంతో ఆర్‌బీఐ ఈ నిర?యం తీసుకుంది. 2019, జనవరి 3న ఆర్బీఐ రూ.3 కోట్లు జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేసింది. అయితే వినియోగదారుల లావాదేవీలతో ఈ జరిమానాకు ఎలాంటి సంబంధం లేదని రిజర్వ్‌బ్యాంకు స్పష్టం చేసింది. కాగా అమెరికా ఆధారిత సిటీబ్యాంక్ 115 సంవత్సరాలుగా భారతదేశంలో పనిచేస్తోంది. భారత్‌లో సిటీ బ్యాంకుకు 35 బ్రాంచీలు, 541 ఎటిఎంల నెట్‌వర్క్‌లు ఉన్నాయి. మరోవైపు గత జులై జూలై 2013 లో, కేవైసీ నిబంధనలు, అక్రమ నగదు లావాదేవీలకు సంబంధించిన సూచనల ఉల్లంఘనకు సిటీబ్యాంకు ''హెచ్చరిక లేఖ'' జారీ చేసింది.



ఐడిఎఫ్‌సి బ్యాంకు పేరు మార్పు

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలోని ఐడిఎఫ్‌సి బ్యాంకు పేరును ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు లిమిటెడ్‌గా మార్చారు. ఈ మార్పు జనవరి 12 నుంచే అమల్లోకి వచ్చిందని శనివారం ఆ బ్యాంకు బిఎస్ఇ ఫైలింగ్‌లో తెలిపింది. పేరు మార్పునకు రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ అనుమతి కూడా తీసుకున్నట్లు పేర్కొంది. ఐడిఎఫ్‌సి బ్యాంకు, బ్యాంకింగేతర విత్త సంస్థ కాపిటల్ ఫస్ట్ క్రితం డిసెంబర్ 18న విలీనం అవుతున్నట్లు ప్రకటించాయి. దీంతో ఇరు సంస్థల ఉమ్మడి రుణ పుస్తకం రూ.1.03 లక్షల కోట్లకు చేరింది. విలీన సంస్థకు కాపిటల్ ఫస్ట్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ వి వైద్యనాథన్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒగా వ్యవహారించనున్నారు.



రూ.33,000 కిందకు బంగారం

- రెండో రోజు క్షీణించిన పసిడి
- ఢిల్లీలో రూ.155 తగ్గిన 10 గ్రాముల బంగారం ధర
- ఏకంగా రూ.600 తగ్గిన కేజీ వెండి ధర
- రూ.40,000 దిగువకు క్షీణత

న్యూఢిల్లీ: బంగారం ధర వరుసగా రెండో రోజు కూడా తగ్గింది. శనివారం పది గ్రాముల బంగారం ధర రూ.33,000 దిగువకు వచ్చేసింది. రూ.155 తగ్గుదలతో రూ.32,875కు క్షీణించింది. దేశీ జువెలర్ల నుంచి డిమాండ్ నెమ్మదించడం, అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు ఇందుకు కారణం. వెండి ధరలు కూడా బంగారం బాటలోనే నడిచాయి. కేజీ వెండి ధర రూ.600 తగ్గుదలతో రూ.39,850కు పడిపోయింది. పరిశ్రమ యూనిట్లు, నాణేపు తయారీదారుల నుంచి డిమాండ్ బలహీనంగా ఉండటం ఇందుకు కారణం.

ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలు సహా దేశీ జువెలర్ల నుంచి డిమాండ్ తగ్గడం బంగారంపై ప్రభావం చూపిందని ట్రేడర్లు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్స్‌కు 1,287.8 డాలర్లకు తగ్గింది. అయితే వెండి ధర మాత్రం ఔన్స్‌కు 15.67 డాలర్లకు పెరిగింది. ఢిల్లీలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.155 క్షీణతతో రూ.32,875కు, 22 క్యారెట్ల బంగారం ధర రూ.155 క్షీణతతో రూ.32,725కు తగ్గింది. కాగా బంగారం ధర శుక్రవారం రూ.40 క్షీణించింది. ఇక ప్రభుత్వ సార్వభౌమ పసిడి పథకంలో 8 గ్రాముల బంగారం ధర స్థిరంగా రూ.25,300 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. వెండి ధర రూ.39,850 కి తగ్గితే.. వారాంతపు ఆధారిత డెలివరీ ధర రూ.295 క్షీణతతో రూ.39,471కి తగ్గింది. ఇక 100 వెండి నాణేల కొనుగోలు, అమ్మకం విషయానికి వస్తే.. కొనుగోలు ధర రూ.77,000 ఉండగా.. అమ్మకం ధర రూ.78,000గా నమోదయ్యింది.

స్మార్ట్ షాపింగ్ అంత.. స్మార్ట్ కాదు



స్మార్ట్‌ఫోన్స్.. వినియోగం అనేది సర్వసాధారణం అయ్యాక.. అందులో రకరకాల బిజినెస్ యాప్‌లు పుట్టుకొస్తున్న తరుణంలో వేలు, లక్షల రూపాయలు విలువచేసే షాపింగ్ నిమిషాల్లోనే జరిగిపోతుంది. అది ఎంతగా అంటే.. టీవీ, కారంపొడి, ఉప్పు, పప్పు, బెల్లం, మే థియేటర్ సౌండ్ సిస్టమ్, మసూరి బియ్యం, కాకరకాయ, టమాటాలు, టూత్‌పేస్ట్, బ్యాగీప్యాంట్, టీషర్ట్.. అగ్గిపెట్టె.. ఇలా ఏవైనా సరే.. ఒకేచోట.. 'సింగిల్ విండో' పద్ధతిలో.. ఇప్పుడు ఆన్‌లైన్లోనే కొనుక్కునే సౌలభ్యాలొచ్చేశాయి. ఇలా ఇంటివద్దే కావాల్సిన వస్తువును విక్రయించి, వాటిని డోర్‌డెలివరీ పద్ధతుల్లో అందుకునే విధానమే ఆన్‌లైన్ షాపింగ్. పండగల సమయాల్లో అయితే.. ఆన్‌లైన్ షాపింగ్ ప్రకటనల జోరు, రు.. అంతాఇంతా కాదు. నిన్న దసరా, రేపు దీపావళి, ఆపై సంక్రాంతి ఇలా పండగల సందరాల్లో అయితే ఆన్‌లైన్ వ్యాపార ప్రకటనలకు లెక్కే ఉండదు. నచ్చిన సరుకును స్మార్ట్‌ఫోన్లో చూసుకుని.. కొనుక్కోవడంలో ఉండే సౌకర్యం మాట పక్కనపెడితే.. అవగాహన లేకుండా ఆన్‌లైన్ షాపింగ్ మాయలోపడితే.. కొన్ని సందరాల్లో భారీ నష్టమే ఏర్పడే ప్రమాదం ఉంది. అందుకే ఆన్‌లైన్ షాపింగ్ చేసేముందు.. ఆయా విక్రయాలు, ఆర్థికలావాదేవీల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి. వస్తువు కొనడం, అమ్మడం అనే విషయంలో కొత్త పద్ధతులకు తెర లేపింది ఇ-కామర్సే. దీంతో ఇ-కామర్స్ సంస్థలు రోజుకి వేల కోట్ల రూపాయల టర్నోవర్ బిజినెస్ నిర్వహిస్తున్నాయి. ఇ-కామర్స్ బిజినెస్ ఎంతగా పెరిగిపోయిందంటే రోజువారీ కూలి చేసుకునే సామాన్యుడి నుంచి కోటీశ్వరుడు దాకా ఆన్‌లైన్‌లోనే క్రయ, విక్రయాలు జరపడం ఇప్పుడు సర్వసాధారణమైంది. దీనినే టెక్నికల్ టర్మ్‌లో ఇ-కామర్స్.. అంటారు. ''ఆన్‌లైన్ షాపింగ్'' అనేది అందరికీ అర్థమయ్యే మాట. ఈ-కామర్స్ గురించి టెక్నికల్‌గా చెప్పాలంటే 'ఈ' అంటే ఎలక్ట్రానిక్. 'కామర్స్' అంటే వ్యాపారం. అంటే ఇంటర్‌నెట్ ఆధారంగా వస్తువుల్ని అమ్మడం, కొనడం అన్నమాట. అయితే ఆన్‌లైన్ మార్కెట్లో వస్తువులు కొనుగోలు చేసే వినియోగదారుడికి ఇ-కామర్స్‌తో తలెత్తే తంత్రాలు, కుతంత్రాలతో పెద్దగా తెలియకపోవొచ్చు. 'నచ్చిన వస్తువు ఇంటికొచ్చిందా? లేదా..?' అన్నదే కావాలి. వినియోగదారుడు మూడు ఆర్డర్లు.. ఆరు చెల్లింపులతో ఖుషీ కావొచ్చు. కానీ అంతకుమించి జాగ్రత్తలూ అవసరమే అన్నది నిపుణుల మాట.

లాభ నష్టాల భేరీజు

ఇంటర్‌నెట్ సౌలభ్యం విస్తరించిన క్రమంలో వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తుల్ని ఆన్‌లైన్లో విక్రయించేందుకు పోటీపడుతున్నాయి. దీంతో ఆయా కంపెనీలు నిత్యావసర వస్తువులు మొదలుకొని, ప్రతి ఒక్కటీ ఆన్‌లైన్లో ఇట్టే



అమ్మేస్తున్నాయి. అయితే ఆన్‌లైన్లో వినియోగదారుడు వస్తువుల కోసం వెచ్చిస్తున్న సొమ్ముకు ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి? ఎలాంటి లాభనష్టాలు ఉన్నాయి? అనేది బేరీజు వేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించకపోతే భారీమూల్యం చెల్లించక తప్పదు. 'ఉత్పాదక కంపెనీలు లేదా అమ్మే ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లు బాగానే వారంటీ, గ్యారంటీ ఇస్తున్నాయిగా?' అనే ప్రశ్న తలెత్తవొచ్చు. కానీ ఆన్‌లైన్ షాపింగ్ అనే విషయంలో నెంబర్‌వన్‌గా చెలామణి అవుతున్న కంపెనీల పట్ల కూడా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే కస్టమర్ల జేబులకు కత్తెర్లు పెట్టడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాయనేది మరిచిపోవొద్దు.

షాపింగ్ సులువే కానీ!

షాప్‌దాకా వెళ్లి ఏదైనా వస్తువు కొనాలంటే జేబులో తగినంత డబ్బు కావాలి. జేబులో ఉన్న డబ్బును బట్టి నచ్చిన వస్తువుల్ని కొనాలా? వద్దా? అనే ఆలోచనలతో తర్జనభర్జనలు పడతాం. అంతకంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే తీరుబడిగా వెలుగు జిలుగులతో మెరిసిపోయే ఆయా షాపింగ్‌మాల్స్‌లో అడుగుపెట్టడా నికి తగిన సమయం, సందరేం చూసుకుంటాం. కానీ ఆన్‌లైన్ షాపింగ్ విషయంలో అలాంటివేమీ అవసరంలేదు. ఇంటి బాల్కనీలో కూర్చుని టీనో, కాఫీనో తాగుతూ స్మార్ట్‌ఫోన్ టచ్‌స్క్రీన్ టచ్ చేసి, అలవోకగా ఆర్డర్ ఇచ్చేయొచ్చు. అందుకు తగ్గట్టుగానే మనం ఎక్కడున్నా వెదికి పట్టుకుని మరీ, మనం ఆర్డర్ చేసిన వస్తువు మనకందిస్తాయి ఆన్‌లైన్ కంపెనీలు. ఈ రోజు డబ్బుల్లేవు, అయినా నాలుగైదు రోజులు ఆగైనా సరే ఆ వస్తువును తీసుకునే వెసులుబాటు కల్పిస్తాయి. ఇలాంటి సౌలభ్యాలు, సౌకర్యాలే కస్టమర్లను ఆకర్షించడానికి ప్రధానకారణం. అయితే తీసుకున్న వస్తువులకు గ్యారంటీ ఎంత అనేదే మన ముందున్న ప్రశ్న. ఈ విషయంలో కస్టమర్లకు జవాబుదారీగా ఉండే ఆన్‌లైన్ కంపెనీలు కొన్నైతే దిక్కున్నవాడితో చెప్పుకో.. పో! అనే మోసపూరిత వ్యవహారంతో నడిచే కంపెనీలు చాలానే ఉన్నాయి. అలా మోసపోయిన కస్టమర్లూ మన మధ్య లేకపోలేదు.

నాణ్యత పసికట్టడంలో..

ఆన్‌లైన్లో షాపింగ్ అంటే డిస్‌ప్లేలో పొందుపరిచిన వస్తువుల ఫొటోలు, వాటి వివరాల్ని చూసి ఎంపిక చేసుకోవడం జరుగుతుంటుంది. అయితే ఇక్కడ వస్తువుల నాణ్యతను పసిగట్టే అవకాశం ఉండదు. మనం బయట బజార్లో దొరికే షాపుల్లో నాణ్యతా ప్రమాణాలను తెలుసుకోవడానికి ఆ వస్తువును భౌతికంగా చూసి, చేతి స్పర్శతో నాణ్యతను పసిగడతాం. అయితే ఆన్‌లైన్ షాపింగ్‌లో అలాంటి అవకాశం ఉండదు. ప్రొడక్ట్ (వస్తువు) కు సంబంధించిన వివరాలు మాత్రమే ఉంటాయి. వాటిని కూలంకషంగా చదివి, నాణ్యతా ప్రమాణాలను అంచనా వేసుకోవాలి. వినియోగదారుల్ని ఆకర్షించే క్రమంలో అగ్గిపుల్ల, పిన్నీసుల్ని సైతం ఎంతో అదుతేంగా, ఉన్నతంగా చూపించే టెక్నాలజీ వచ్చేసింది. ఈ క్రమంలో అక్కడ ఆకర్షణీయంగా కనిపించే బొమ్మల్ని చూసి 'చాలా బావుంది, అదుతేం' అనే భావనకు రాకుండా నిజరూపంలో ఆ వస్తువు ఎలా ఉంటుందనే విషయంలో ఓ అవగాహనకు రావాలి.

అలాగే కంపెనీని పోలిన కంపెనీలు ఉంటాయి. అంటే ఒక అక్షరం తేడాతో పేరుమోసిన కంపెనీల పేర్లతో నకిలీ వ్యాపారాలు అనేకం మార్కెట్లో హల్‌చల్ చేయడం మనకు తెలుసు. ఇలాంటి దిగువశ్రేణి ఉత్పత్తి కంపెనీలు చాలావరకూ ఆన్‌లైన్ షాపింగ్ విధానాన్ని అవలంభిస్తున్నాయి. అలాంటి కంపెనీ ఉత్పత్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అలాగే బ్రాండెడ్ కంపెనీలైనా, చిన్నా చితకా కంపెనీలైనా ఆన్‌లైన్లో అమ్మే వస్తువుకు ఎంత గ్యారంటీని ఇవ్వగలుగు తున్నాయి? మార్కెట్ ధరకు ఆన్‌లైన్ షాపింగ్ ధరకు తేడా ఎంత? అనే విషయాలపై శ్రద్ధపెట్టాలి.

డిస్కౌంట్లు.. ఆఫర్లు

వ్యాపార రంగాల్లో ఉగాది, దసరా, దీపావళి, క్రిస్‌మస్ వంటి పండగ సీజన్లలో డిస్కౌంట్ సేల్ ఆఫర్లనేవి సర్వసాధారణం. ఈ విషయంలో ఈ-మార్కెట్ (ఆన్‌లైన్ షాపింగ్ కంపెనీలు) అసలు మార్కెట్ కంటే ముందుంటుంది. 40 శాతం, 60 శాతం డిస్కౌంట్లు అని ఆరాటేంగా జరిగే ప్రచారాల్లో నిజమెంత? అమ్మే వస్తువుల్లో నాణ్యత ఎంత? అనేది పరిశీలించాలి. సాధారణంగా పండగ సీజన్లలో కొత్త ఉత్పత్తులతో పాటే నిల్వ సరుకుకు డిస్కౌంట్ సేల్ పేరుతో అమ్మే ప్రయత్నాలు జరుగుతుంటాయి. నాణ్యతలేని వస్తువుల్ని కూడా అమ్మేసి, లాభపడుతుంటాయి. ఇటీవల కాలంలో ప్రముఖ ఈ-కామర్స్ కంపెనీలు డిస్కౌంట్ల ఆఫర్ల ప్రకటనల కోసం కోట్లాది రూపాయల్ని ఖర్చు పెడుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆన్‌లైన్ షాపింగ్ అంటే ఉత్పత్తిదారుడు, వినియోగదారుడికి మధ్య మధ్యవర్తిత్వం నెరిపే విధానం. ఉత్పత్తి కంపెనీల నుంచి ఆయా వస్తువుల్ని వినియోగదారుడికి అమ్మడం, చేర్చడం చేసినందుకుగాను సదరు ఆన్‌లైన్ కంపెనీలు కమీషన్ తీసుకుంటాయి. ఆన్‌లైన్ మార్కెట్ విస్తరించిన నేపథ్యంలో ఈ షాపింగ్ వెబ్‌సైట్లు రోజువారీ లక్షలాది రూపాయల లాభాన్ని ఆర్జిస్తున్నాయి. అయితే వినియోగదారుడికి జవాబుదారీగా ఉండాల్సింది ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లే. అందుకే గ్యారంటీని ఇవ్వగలిగే కంపెనీలేమిటో అవగాహనకు రావాలి. ఇలాంటి విషయాల్లో అవగాహన కలిగి ఉన్నప్పుడే.. ఆన్‌లైన్ షాపింగ్ వైపు మొగ్గ చూపాలి.



నగదు చెల్లింపులు



ఆన్‌లైన్ షాపింగ్‌లో ప్రధానంగా డబ్బు చెల్లించే విధానం మూడు పద్ధతుల్లో ఉంటుంది. 1. క్రెడిట్ కార్డ్, 2. డిబెట్ కార్డ్, 3.డెలివరీ టైమ్‌లో చెల్లించే పద్ధతి. మూడో పద్ధతినే ఎంచుకోవడం శ్రేయస్కరం. వీలైనంత తక్కువగా బ్యాంక్ లావాదేవీలు ఇంటర్‌నెట్ ద్వారా జరపకుండా ఉండటం చాలా ముఖ్యం. ఎందుకంటే ఇటీవల కాలంలో నెట్ బ్యాంకింగ్ ద్వారా జరుగుతున్న మోసాలు అనేకం.

రాబడి లేకున్నా.. ఇన్వెస్ట్ చేయాల్సిందే!

- రక్షణ లక్ష్యంగా కొన్నింట్లో ఇన్వెస్ట్ చేయాలి
- టర్మ్ పాలసీతో కుటుంబానికి ఆర్థిక భద్రత



ఎవరైనా రాబడి కోసమే ఇన్వెస్‌మెంట్లు కొనసాగిస్తారు. అయితే అన్ని ఇన్వెస్ట్‌మెంట్లపై రాబడులను ఆశించకూడదు. ప్రధానంగా నాలుగు పెట్టుబడి సాధనాల నుంచి ఎలాంటి రిటర్న్స్ ఆశించొద్దు. అవేంటో చూద్దాం..

ఎమర్జెన్సీ ఫండ్

ఎప్పుడు ఎలాంటి ఘటనలు చోటుచేసుకుంటాయో తెలియదు. అందుకే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఒక ప్రత్యేకమైన ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. అదే ఎమర్జెన్సీ ఫండ్. ఉద్యోగం కోల్పోయినప్పుడు, మెడికల్ ఎమర్జెన్సీ వంటి వాటి కోసం ఎమర్జెన్సీ ఫండ్ ఉపయోపడొచ్చు. భద్రత లక్ష్యంగా ఎమర్జెన్సీ ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. అంతేతప్ప రాబడుల కోసం కాదు. సేవింగ్స్ అకౌంట్స్, లిక్విడ్ ఫండ్స్ వంటి వాటిల్లో ఎమర్జెన్సీ ఫండ్ నిధులను ఇన్వెస్ట్ చేయవచ్చు. వీటిల్లో రాబడి తక్కువగా ఉంటుంది. రక్షణ లక్ష్యంగా ఈ ఇన్వెస్ట్‌మెంట్లను కొనసాగిస్తున్నందున.. రాబడిని ఆలోచించకూడదు. లిక్విడ్ ఫండ్స్‌లో నుంచి రూ.50,000 వరకు వెంటనే విత్‌డ్రా చేసుకోవచ్చు.



జీవిత బీమా



జీవిత బీమా పాలసీని కూడా ఇన్వెస్ట్‌మెంట్ కోణంలో చూడకూడదు. టర్మ్ పాలసీ కలిగిన వ్యక్తి ముందుగానే చనిపోతే తన కుటుంబానికి పాలసీ మొత్తం లభిస్తుంది. అదే పాలసీ కాలంలో చనిపోకపోతే ఎలాంటి మొత్తం రాదు. అనుకోని పరిస్థితుల్లో పాలసీదారుడు చనిపోతే ఆయన కుటుంబం ఆర్థిక సమస్యలు ఎదురవ్వకుండా పాలసీ మొత్తం బాసటగా నిలుస్తుంది. కుటుంబ ఆర్థిక రక్షణ లక్ష్యంగా టర్మ్ పాలసీ తీసుకోవాలి.

బంగారు ఆభరణాలు

బంగారంలో ఇన్వెస్ట్‌మెంట్లు కొనసాగించడం మంచి నిర?యమే. అయితే బంగారాన్ని ఆభరణాల రూపంలో కొనుగోలు చేయడం తెలివైన చర్య కాదు. తయారీ, వేస్టేజ్ చార్జీల రూపంలో ధరలో 10-35 శాతం కోల్పోవలసి వస్తుంది. బంగారాన్ని విక్రయించడం కూడా కష్టమే. చాలా జువెలర్ సంస్థలు పాత బంగారు నగలను కొత్త వాటితో మార్పు చేసుకునే వెసులుబాటు కల్పిస్తుంటాయి. అంతేకానీ బంగారం నగలు కొనుగోలు చేసి నగదు ఇవ్వవు. అలాగే జువెలరీ అనేది సంపదకు గుర్తుగా ఉంటుందే తప్ప.. ఎలాంటి లాభాలను అర్జించి పెట్టదు. అయితే ఆర్థిక ఇబ్బందులు వచ్చినప్పుడు బంగారం ఆభరణాలను తనఖా పెట్టుకోవచ్చు. సమస్యను తాత్కాలికంగా అధిగమించొచ్చు.

ఇల్లు



ఇంట్లో నివాసం ఉండొచ్చు. అయితే భవిష్యత్ అవసరాల కోసం ఇంటిని విక్రయించడం సాధ్యపడకపోవచ్చు. ఇల్లు అనేది ఆస్తి. ఇన్వెస్ట్ మెంట్ సాధనం కాదు. ఒకవేళ ఇల్లు విక్రయించినా కూడా మరొక ఇల్లు కొనాల్సి ఉంటుంది. లేదా అద్దెకు అయినా ఉండా లి. అందువల్ల ఇల్లు ఎవరికైనా తప్పనిసరి.

భారీగా పెరిగిన పెట్రోలు, డీజిల్ ధరలు

- అంతర్జాతీయంగా తగ్గినా.. దేశీయంగా పెరుగుతున్నపెట్రో ధరలు
- నాలుగురోజుల్లో రూ.1.25 పెరిగిన పెట్రోలు, రూ.1.45 పెరిగిన డీజిల్ ధరలు

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ.. దేశీయంగా మాత్రం 'పెట్రో' ధరలకు వరసగా నాలుగోరోజు కూడా రెక్కలొచ్చాయి. గత మూడు రోజులుగా సల్పంగా పెరిగిన ధరలు ఆదివారం (జనవరి 13) మరింత ఎక్కువగా పెరిగాయి. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు 48 – 53 పైసలు పెరగ్గా.. డీజిల్ ధరలు 59 – 64 పైసల వరకు పెరిగింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 60.48 డాలర్ల వద్ద.. డబ్ల్యూటీఐ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 51.59 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి. తాజాగా పెరిగిన ధరల ప్రకారం.. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోలు ధర 49 పైసలు, లీటరు డీజిల్ ధర 59 పైసలు పెరిగింది. దీంతో పెట్రోల్ ధర రూ.69.75కి చేరగా.. డీజిల్ ధర రూ.63.69 కి చేరింది. ఇఖ వాణిజ్య రాజధాని ముంబయిలో పెట్రోలు ధర 48 పైసలు పెరిగి రూ.75.39 వద్ద ఉండగా.. డీజిల్ ధర 62 పైసలు పెరిగి రూ.66.66 వద్ద కొనసాగుతోంది. ఇక హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర 53 పైసలు, డీజిల్ ధర 64 చొప్పున పెరిగింది. దీంతో పెట్రోలు ధర రూ.74 చేరగా.. డీజిల్ ధర రూ.69.24 వద్ద కొనసాగుతోంది. అమరావతిలో పెట్రోల్ రూ.73.81 వద్ద, డీజిల్ రూ.68.71 వద్ద కొనసాగుతున్నాయి.



ఓ తల్లిగా తొలి గ్రాండ్ శ్లామ్ టైటిల్ గెలిచేందుకు అమెరికా నల్ల కలువ సెరెనా విలియమ్స్ సిద్ధమైంది. ఈ ఏడాది తొలి గ్రాండ్ శ్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ సోమవారమిక్కడ ప్రారంభం కానుంది. సెరెనాతో పాటు మహిళల విభాగంలో ఏంజెలిక్ కెర్బర్, కరోలిన్ వోజ్నియాకి, సీమోనా హాలెప్, పురుషుల విభాగంలో నోవక్ జొకోవిచ్, రాఫెల్ నాదల్, ఆండీ ముర్రే వంటి టాప్ సీడెడ్ ప్లేయర్స్ సిద్ధమయ్యారు

తల్లిగా తొలి గ్రాండ్ శ్లామ్‌కు...

సెరెనా రెఢీ

నేటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్





కెర్బర్



హాలెప్



జొకోవిచ్



వోజ్నియాకి



ఫెడరర్



మెల్‌బోర్న్: మెటర్నిటీ లీవ్ తర్వాత సెరెనా ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు ఆస్ట్రేలియా ఓపెన్‌కు వచ్చిందని ఆమె కోచ్ ప్యాట్రిక్ చెప్పారు. ఫ్రాన్స్‌కు చెందిన ప్యాట్రిక్.. సెరెనా సాధించిన 23 గ్రాండ్ శ్లామ్స్ టైటిళ్లకు గాను 10 టైటిళ్లలో ఆమెను గెలుపు దిశగా నడిపించాడు. గతేడాది వింబుల్డన్, యూఎస్ ఓపెన్ టోర్నీల్లో ఫైనల్‌కు చేరినప్పుడే సెరెనా ఉత్తమ శరీరాకృతితో ఉందని కోచ్ తెలిపారు. ఆమె పూర్తి ఫిట్‌నెస్‌తో ఉందని చెప్పారు. 24 గ్రాండ్ శ్లామ్ సింగిల్స్ టైటిళ్లు గెలిచిన మార్గరెట్ కోర్ట్ ఆల్ టైమ్ రికార్డును సెరెనా మెల్‌బోర్న్ పార్క్‌లో సరిచేస్తుందని ఆయన అన్నారు. 'గతేడాది పాప పుట్టిన తర్వాత కూడా ఆమె అసాధారణ ప్రతిభ కనబరిచింది. చాలా ఫాస్ట్‌గా తన శరీరాకృతిని అందంగా తీర్చిదిద్దుకుంది. కాన్పు తర్వాత ఆమె చాలా వైద్య సమస్యలను ఎదుర్కొంది. కానీ 100 శాతం ఫిట్‌నెస్‌తో లేదు. అయినప్పటికీ ఆమె రెండు గ్రాండ్ శ్లామ్ టోర్నీల్లో ఫైనల్‌కు చేరుకుందంటే ఫిట్‌గా ఉన్నట్టే. ఆమె నాకు కొన్నేళ్లుగా తెలుసు. ఆమె పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తుందని నేను భావిస్తున్నాను. కానీ దానికి మరికొంత సమయం అవసరమైంది. ఇప్పుడు పూర్తి ఫిట్‌గా ఉంది. మీరు చూడొచ్చు. కోర్టులో ఆమె కదలికలను బట్టి మీకే అర్ధమవుతుంది. అత్యున్నతమైన ఫిట్‌నెస్‌తో ఆమె బరిలోకి దిగబోతోందని నేను భావిస్తున్నాను. ప్రత్యర్థులతో పోటీ పడేందుకు ఆమె సిద్ధంగా ఉంది. ఆమె బరిలోకి దిగిందంటే గెలిచేందుకు రెడీ' అని ప్యాట్రిక్ వివరించారు. రెండు నెలల గర్భవతిగా ఉన్నప్పుడే సెరెనా 2017 ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను గెలిచి రికార్డు సృష్టించింది. కానీ మెటర్నిటీ లీవ్ తర్వాత టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయింది.

కొత్త కోచ్ రైనర్ ష్వెట్లర్‌తో ప్రపంచ 2వ ర్యాంక్ ప్లేయర్ ఏంజెలిక్ కెర్బర్ ఉత్సాహంగా ఉంది. గతేడాది పేలవ ప్రదర్శనను మర్చిపోయి కొత్త సంవత్సరంలో కొత్త ఆలోచనలతో బరిలోకి దిగనుంది. గతేడాది సింగపూర్‌లో జరిగిన డబ్ల్యూటీఏ ఫైనల్స్‌కు ముందు భవిష్యత్ ప్రణాళికల విషయంలో కోచ్ విమ్ ఫిస్సెట్‌తో కెర్బర్‌కు అభిప్రాయ భేదాలు వచ్చాయి. దీంతో ఆమె.. ఫిస్సెట్‌ను కాదనుకుంది. ఒక నెల తర్వాత ష్వెట్లర్ తన కొత్త కోచ్ అని ప్రకటించింది. 'ష్వెట్లర్ నా తొలి కోచ్. కోర్టులో ఒత్తిడిలో ఎలా ఉండాలో, భావోద్వేగాలను ఎలా కంట్రోల్ చేసుకోవాలో ఆయనకు తెలుసు. నా ఆలోచనలను ఆయన బాగా అర్థం చేసుకుంటారు. నాలాగే ఆయనకు టెన్నిస్ అంటే చాలా ఇష్టం. కోర్టులో హార్డ్ వర్క్ చేస్తారు. మేమిద్దరం కలిసి ఉత్తమ ప్రతిభ కనరిచేందుకు కృషి చేస్తున్నాం' అని కెర్బర్ చెప్పింది.

ఇక కోచ్ లేని ప్రపంచ నంబర్ వన్ సీమోనా హాలెప్ సొంత ఆలోచనలతో బరిలోకి దిగనుంది. కోచ్ డారెన్ కహిల్‌తో విభేదాల కారణంగా ఆమె ఒంటరిగా సిద్ధమవుతోంది. గాయం నుంచి కోలుకునేందుకు ఆమెకు చాలా రోజులు పట్టింది. తక్కువ సమయంలో ప్రాక్టీస్ చేసి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడేందుకు ఆమె రిస్క్ తీసుకుంటుందేమో అనిపిస్తోంది. గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలిచిన ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ హాలెప్ గత సెప్టెంబర్ తర్వాత ఒకే ఒక్క మ్యాచ్ ఆడింది. సిడ్నీ ఇంటర్నేషనల్ టోర్నీలో బుధవారం ఆస్ట్రేలియాకు చెందిన యాష్లే బార్టిని 6-4, 6-4తో ఓడించింది. తన వెన్ను నొప్పి గాయం 100 శాతం నయమైందని హాలెప్ పేర్కొంది.

డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్నందుకు చాలా గర్వంగా ఉందని కరోలిన్ వోజ్నియాకీ పేర్కొంది. ఆరోగ్య సమస్యలు తన గేమ్‌పై ఏమాత్రం ప్రభావం చూపలేవని ఆమె ఉత్సాహంగా చెప్పింది. గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచి కెరీర్‌లో తొలి గ్రాండ్ శ్లామ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్న వోజ్నియాకి రోగ నిరోధక శక్తిని బలహీనపరిచే రుమటాయిడ్ ఆర్థరైటిస్ వ్యాధితో బాధపడుతోంది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్నందుకు తనపై అదనపు ఒత్తిడి ఏమీ లేదని 38 ఏళ్ల వోజ్నియాకి తెలిపింది.


గాయాల కారణంగా బ్రిటీష్ ఆటగాడు ఆండీ ముర్రే శనివారం రిటైర్మెంట్ ప్రణాళికను ప్రకటించాడు. అయితే సుదీర్ఘ కాలం టెన్నిస్ ఆడటం నిజంగా తన అదృష్టమని స్విస్ దిగ్గజ ఆటగాడు రోజర్ ఫెడరర్ ఆదివారం గర్వంగా చెప్పాడు. ఆస్ట్రేలియా ఓపెన్ తన కెరీర్‌లో చివరిదని శనివారం ముర్రే ప్రకటించిన సంగతి తెలిసిందే. 37 ఏళ్ల ఫెడరర్ అద్భుత రీతిగా ఇంకా గ్రాండ్ శ్లామ్స్ ఆడుతూ యువకులతో పోటీ పడుతుండడం నిజంగా ఆశ్చర్యం. 21వ గ్రాండ్ శ్లామ్, 7వ ఆస్ట్రేలియన్ టైటిల్ కోసం బరిలోకి దిగనున్న ఫెడరర్ వరుసగా 20వసారి మెల్‌బోర్న్ కోర్టులో సోమవారం తొలి రౌండ్ మ్యాచ్ ఆడనున్నాడు. ఈ మ్యాచ్‌లో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన డెనిస్ ఇస్టోమిన్‌తో ఫెడరర్ ఆడతాడు. తన శరీర సామర్థ్యాన్ని తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు తనను సిద్ధం చేస్తున్న సపోర్ట్ స్టాఫ్‌ను ఫెడరర్ కొనియాడాడు. నిజంగా తనకు ఆదృష్టం కలిసిరాకపోతే ఇన్ని రోజులు టెన్నిస్ ఆడే వాడిని కాదని చెప్పాడు. 'నిజంగా అంతో ఇంతో నాకు అదృష్టం కలిసొస్తోంది. కొన్నేళ్ల క్రితం జరిగిన సంఘటన గుర్తు చేసుకుంటే.. నా కవల పిల్లలకు స్నానం చేయిస్తున్న సమయంలో మోకాలు పట్టేసింది. ఇప్పుడు అదే మోకాలు గ్రాండ్ శ్లామ్ ఆడేందుకు సహకరిస్తోంది. ఇంతకంటే అదృష్టం ఇంకేం కావాలి' అని ఫెడరర్ చెప్పాడు.

ఆస్ట్రేలియన్ ఓపెన్ అంటే తనకెంత ఇష్టమో సెర్బియాకు చెందిన ప్రపంచ నంబర్ వన్ నోవక్ జొకోవిచ్ ఆదివారం వెల్లడించాడు. దశాబ్దం క్రితం మెల్‌బోర్న్‌లో తొలి మేజర్ టైటిల్ గెలిచానని.. తన కెరీర్‌ను ఎన్నో మలుపులు తిరిగేందుకు ఇక్కడే పునాది పడిందని చెప్పాడు. 2008 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఫ్రెంచ్ ఆటగాడు జొ-వెల్‌ఫ్రీడ్ సొంగను ఓడించడంతో జొకోవిచ్ కెరీర్ మలుపు తిరిగింది. ఆ తర్వాత మరో ఐదుసార్లు విజేతగా నిలిచాడు. చివరిసారిగా 2016లో ముర్రేను ఓడించి టైటిల్ గెలిచాడు. '2008లో తొలి టైటిల్ గెలిచాను. ఆ రోజును ఎన్నటికీ మర్చిపోలేను. అది నాలోని ఎన్నో ద్వారాలను తెరిచింది. ముఖ్యంగా నా మీద నాకు నమ్మకాన్ని కలిగించింది. నేను కూడా ప్రపంచంలోని పెద్ద టోర్నీల్లో మేటి ఆటగాళ్లను ఎదుర్కొని టైటిల్ గెలవగలనన్న ధైర్యాన్ని ఇచ్చింది' అని జొకోవిచ్ అన్నాడు.

శుభ్‌మన్ గిల్, శంకర్‌లకు పిలుపు

- పాండ్య, రాహుల్ స్వదేశం పయనం

ముంబై: క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్ ఇప్పట్లో టీమిండియా క్యాప్‌ను పెట్టుకునే సూచనలు కనిపించడం లేదు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీరిద్దరు విచారణ నిమిత్తం ఆదివారం సిడ్నీ నుంచి భారత్‌కు బయల్దేరారు. 'వాళ్ల టిక్కెట్టు బుక్ అయ్యాయి. తిరుగు ప్రయాణంలో ఉన్నారు. విచారణ పూర్తయ్యే వరకు పాండ్య, రాహుల్ క్రికెట్ ఆడలేరు' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఆస్ట్రేలియాతో జరగనున్న మిగిలిన రెండు వన్డేలకు తమిళనాడు ఆల్ రౌండర్ విజయ్ శంకర్‌ను జట్టులోకి తీసుకున్నారు. శనివారం అర్ధ రాత్రి పరిణామాల నేపథ్యంలో భారత అండర్-19 వరల్డ్ కప్ విజేత జట్టు ఆటగాడు శుభ్‌మన్ గిల్ ఆస్ట్రేలియా బయల్దేరాడు. న్యూజిలాండ్ పర్యటనలో అతను టీమిండియాకు ఆడతాడు. ఇటీవల మెల్‌బోర్న్‌లో అరంగేట్ర టెస్టు మ్యాచ్ ఆడిన బెంగళూరు బ్యాట్స్‌మన్ మయాంక్ అగర్వాల్.. శంకర్‌తో కలిసి వెళాల్సివుండింది. కానీ గాయం కారణంగా శంకర్ ప్రయాణం ఆలస్యమవుతోంది. పాండ్య, రాహుల్‌పై విచారణ వేగవంతం చేయడం లేదని.. అలా చేస్తే వాళ్లను రక్షించే ప్రయత్నాలు చేస్తున్నట్టు అర్థం వచ్చే అవకాశముందని కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీఓఏ) సభ్యులు వినోద్ రాయ్, డయానా ఎడుల్జీ, బీసీసీఐ సీఈఓ రాహుల్ జొహ్రి శనివారం తెలిపారు.



శంకర్

అభినవ్ షా సంచలనం

- అతిపిన్న చాంపియన్‌గా రికార్డు
- ఖేలో ఇండియా యూత్ గేమ్స్

పుణె: అభినవ్ షా అతి పిన్న చాంపియన్‌గా రికార్డు సృష్టించాడు. ఇక్కడ జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో మెహులి ఘోష్‌తో కలిసి 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించాడు. అసన్‌సోల్‌కు చెందిన ఈ 10 ఏళ్ల చిన్నారి పశ్చిమ బెంగాల్‌కు చెందిన మెహూలి పసిడి పతకం సాధించడంలో తాడ్పడ్డాడు. ఆరో తరగతి చదువుతున్న అభినవ్ గురి చూసి తుపాకి పేల్చేందుకు తగినంత సమయం తీసుకున్నాడు. తన ప్రతిభను చాటాడు. అత్యంత ప్రతిభావంతుడైన ఈ చిన్నారి తన సహచరులనే కాదు తల్లిదండ్రులను, రాష్ట్రాన్ని గౌరవప్రదం చేశాడు. ఫైనల్లో పశ్చిమ బెంగాల్ జట్టు 501.7 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. గత కొన్ని వారాలుగా పాజిటివ్ ఫలితాలు సాధిస్తున్న ఈ చిన్నారి ఈ పోటీల కోసం సీరియస్‌గా ప్రాక్టీస్ చేశాడు. ప్రతిదానికి సిగ్గుపడే అభినవ్ తండ్రి రూపేష్ సూచనలతో, కోచ్ జయ్‌దీప్ కర్మాకర్ శిక్షణలో అద్భుతాలు సృష్టిస్తున్నాడు.



కోలుకుంటున్న మారడోనా

- శస్త్ర చికిత్స విజయవంతం

బ్యూనోస్ ఎయిర్స్: ఫుట్‌బాల్ మాంత్రికుడు, అర్జెంటీనా వరల్డ్ కప్ విజేత జట్టు కెప్టెన్ డీగో మారడోనా కోలుకుంటున్నారు. కడుపులో రక్తస్రావంకు సంబంధించి శనివారం కూడా శస్త్ర చికిత్స విజయవంతంగా జరిగిందని ఆయన లాయర్ మటియాస్ మోర్ల చెప్పారు. 58 ఏళ్ల బొక జూనియర్స్ అండ్ నపోలీ మాజీ ఆటగాడు మారడోనాకు కడుపులో రక్త స్రావం అవుతున్నట్టు ఈ నెల ఆరంభంలో బయటపడింది. బ్యూనోస్ ఎయిర్స్ నగర శివార్లలోని ఒలివోస్‌లోని ఓ హాస్పిటల్‌కు చెకప్ కోసం వెళ్లగా ఇది బయటపడింది. హెర్నియా కారణంగా అధిక రక్త స్రావం జరగడంతో శనివారం ఆపరేషన్ చేశారు. 'మారడోనా సర్జికల్ ప్రొసీజర్ పూర్తయింది. థ్యాంక్ గాడ్.. అంతా సవ్యంగా జరిగింది' అని లాయర్ మోర్ల ట్విట్టర్‌లో పేర్కొన్నారు. మితిమీరిన జీవన విధానం కారణంగా గత ఏడాది కాలంగా మారడోనా వరుసగా ఆస్పత్రికి వెళ్తూనే ఉన్నారు. 2018లో రష్యాలో జరిగిన వరల్డ్ కప్‌లో ఆయన చివరిసారిగా అనారోగ్యానికి గురయ్యారు. యవ్వనంలో కొకైన్ ఎక్కువగా వాడటం కారణాన 2004లో మారడోనాకు గుండె, శ్వాస సంబంధిత తీవ్ర అనారోగ్యం కలగడంతో తొలిసారి ఆస్పత్రిలో చేర్చారు. తర్వాత క్యూబా, అర్జెంటీనాలలో డ్రగ్ పునరావాస కేంద్రాలకు వెళ్లారు. 2005లో స్టమక్-స్టాప్లింగ్ ఆపరేషన్ జరగడంతో బరువు తగ్గారు. ఆల్కహాల్ సమస్యల నుంచి బయటపడేందుకు 2007లో తనకు తానుగా బ్యూనోస్ ఎయిర్స్‌లోని ఓ క్లినిక్‌కు వెళ్లి చెకప్ చేయించుకున్నారు. మోకాళ్ల సమస్యలు రావడంతో గత కొద్ది నెలలుగా ఊత కర్రల సహాయంతో నడుస్తున్నారు. మారడోనా మెక్సికోలు వెళ్లాల్సిన సమయంలో ఆయన కడుపులో రక్త స్రావాన్ని డాక్టర్లు కనుగొన్నారు. మెక్సికో సెకండ్ డివిజన్ జట్టు డొరడోస్ డి సినలోవాకు మారడోనా కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. మారడోనా పూర్తిగా కోలుకోగానే మళ్లీ కోచింగ్ బాధ్యతలు చేపడతారని లాయర్ మోర్ల చెప్పారు.



రాయుడు బౌలింగ్ యాక్షన్‌పై ఫిర్యాదు

దుబాయ్: టీమిండియా బ్యాట్స్‌మన్, పార్ట్ టైమ్ ఆఫ్ స్పిన్నర్ అంబటి రాయుడు బౌలింగ్ యాక్షన్‌పై ఫిర్యాదు అందినట్టు ఐసీసీ ఆదివారం తెలిపింది. ఆస్ట్రేలియాతో శనివారం సిడ్నీలో జరిగిన తొలి వన్డేలో రాయుడు 2 ఓవర్లు బౌలింగ్ వేసిన సంగతి తెలిసిందే. '33 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ బౌలింగ్ యాక్షన్ చట్టబద్ధతపై మ్యాచ్ అఫీషియల్స్ ఇచ్చిన నివేదికను టీమిండియా మేనేజ్‌మెంట్‌కు అందజేశాం' అని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. అయినప్పటికీ జట్టుకు అవసరమైతే రాయుడు బౌలింగ్ చేస్తాడు. 'రాయుడు అనుమానాస్పద చట్టవ్యతిరేక బౌలింగ్ యాక్షన్‌కు సంబంధించి టెస్టులు, వన్డేలు, టీ20లను పరిశీలిస్తాం. 14 రోజుల్లోపు అతను బౌలింగ్ పరీక్షకు హాజరు కావాల్సివుంటుంది. పరీక్ష ఫలితాలు వెలువడే వరకు రాయుడు అంతర్జాతీయ క్రికెట్‌లో బౌలింగ్ చేసేందుకు అనుమతి లభిస్తుంది' అని ఆ ప్రకటనలో ఐసీసీ పేర్కొంది. 46 వన్డేల కెరీర్‌లో రాయుడు 201 ఓవర్లు వేసి 41.33 సగటులో 3 వికెట్లు మాత్రమే తీశాడు. తాను పాల్గొన్న 6 టీ20ల్లో బౌలింగ్ చేయలేదు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District. Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.